

MVS
PUBLICATIONS
కౌంటర్ ఫీట్ కిల్లర్
మధుబాబు

# ముందు జరిగిన కథ

పాకిస్థాన్ బోర్డర్‌కి పది మైళ్ళ దూరంలో వుంటుంది.

మస్తాన్‌పురి పట్టణం. పేరుకు అది పట్టణమే కాని పట్టుమని పది వందల యిళ్ళు కూడా అక్కడ కనిపించవు.

ఆ రోజు సూర్యుడు పడమటి దిశకు పరుగులు తీస్తున్న సమయంలో బోర్డర్‌ని దాటి పట్టణంలోకి వచ్చాడు సుల్తాన్ అహమద్. వట్టి చేతులతో రాలేదతను. వెంట పెద్ద పెద్ద సూట్‌కేసులు రెండు వున్నాయి.

వాటిని చూడగానే చింపి చేటంత అయింది మస్తాన్‌పురి సేట్ మనోరంజన్ దాస్ వదనం.

"అరే సుల్తాన్ భాయ్... ఆజావ్ మేరే ప్యారే... నీది దర్శనం మాకీ పూరా కరువై పోయిందిబే..." అంటూ చేతులు జాచి సాదరంగా ఆహ్వానించాడు.

బోర్డర్‌ని పెట్రోల్ చేసే సైనికుల్ని ఏమార్చి ఎటువంటి వస్తువులనైనా స్మగుల్ చేయటం సుల్తాన్ స్పెషాలిటీ. మస్తాన్‌పురికి వచ్చినప్పుడల్లా ఏదో ఒక వస్తువును తీసుకొస్తాడతను. ఆ మాల్‌ని ఖరీదు చేసి ఇండియన్ మార్కెట్‌లోకి పుష్ చేస్తాడు సేట్ మనోరంజన్ దాస్.

ఆ రోజు మాత్రం తను తీసుకొచ్చిన సూట్‌కేసులను సేట్‌జీ ముందు పెట్టలేదు సుల్తాన్.

"మనోరంజన్ సాబ్... అర్జంటుగా అవతలికి వెళ్ళి పోవాలి నేను. వేగంగా పోయే వాహనం ఏదైనా వుంటే చూడండి..." అంటూ జేబులో నుంచి రెండు నోట్ల కట్టల్ని తీసి అతని చేతిలో పెట్టాడు.

ఆపైన అనవసరమైన ప్రశ్నలతో అతన్ని వేధించలేదు సేట్ జీ. అతన్ని అక్కడే కూర్చోమని చెప్పి యింట్లోకి పోయాడు.

అరగంట తరువాత ఆ యింటి ముందుకు వచ్చి నిలబడింది నిగనిగ లాడుతున్న నల్లటి అంబాసిడర్ కారు.

సుల్తాన్ కళ్ళు మిలమిల మెరిశాయి దాన్ని చూడగానే. కాళ్ళ దగ్గర వున్న సూట్ కేసుల్ని తీసుకుపోయి డిక్కీలో పడేసి లాక్ చేశాడు.

"అరే సుల్తాన్ భాయ్.. అంత తొందర దేనికి బే? రెండు గ్లాసులు వేసుకు పోదువు గాని... లోపలికి రా..." అంటూ అతన్ని పిలిచాడు మనోరంజన్ దాస్.

కాదని అనలేక పోయాడు సుల్తాన్. గ్లాసుల పేరు వింటే చాలు అతన్ని మనస్సు అదో విధమున ఆనంద లోకాలకు ఎగిరిపోతుంది.

రెండు గ్లాసులు కాస్తా నాలుగైనాయి రాత్రి ఎనిమిది గంటల సమయంలో నాటు సారా నిషా నరనరాలకు వ్యాపిస్తూ వుండగా తూలుతూ బయటికి వచ్చి అంబాసిడర్ని ముందుకు పోనిచ్చాడు సుల్తాన్.

"జాగ్రత్త సుల్తాన్ పోలీసుల ఎద్దడి యీ మధ్య చాలా ఎక్కువై పోయింది జాగ్రత్తగా పోయిరా." అంటూ గుమ్మం దాకా వచ్చి హెచ్చరించాడు మనోరంజన్ దాస్.

మూసుకుపోతున్న కళ్ళను బలవంతంగా తెరిచి వుంచుతూ, తనలో తను వికృతంగా నవ్వుకున్నాడు సుల్తాన్.

పోలీసుల్ని చూసి తను భయపడటమా?

హ్హ హ్హ హ్హ ! సుల్తాన్ అహమద్ పేరు వింటే వట్టి పోలీసులే కాదు... పోలీసు అధికారులు కూడా భయపడే రోజులు రాబోతున్నాయి!!

మస్తాన్ పురిని దాటి మక్కిన్ భోలా ట్రంక్ రోడ్ వైపు మరలింది అంబాసిడర్. పాంటు జేబుల్ని తడుముకుని సిగరెట్ పాకెట్‌ని బయటికి తీశాడు సుల్తాన్. వంటిచేత్తో సిగరెట్‌ని వెలిగించుకునే ప్రయత్నం చేశాడు కాని ప్రయోజనం లేకపోయింది.

అంబాసిడర్ ని రోడ్ మధ్యలో ఆపి ఎలాగైతేనేం వెలిగించుకున్నాడు సిగరెట్‌ని. ఆ సమయంలోనే అతనికి కనిపించింది డాష్ బోర్డులో వున్న ట్రాన్సిస్టర్.

"డబ్బు యివ్వాలే గాని... మనోరంజన్ దాస్ సప్లయి చేయలేని వస్తువు అంటూ వుండదు కాబోలు..." అని అనుకుంటూ ఆ ట్రాన్సిస్టర్‌ని ఆన్ చేసి అంబాసిడర్‌ని ముందుకు పోనిచ్చాడు.

ఒక అరగంట సేపు సినిమా పాటల్ని వినిపించింది ట్రాన్సిస్టర్. ఆ తరువాత రాజస్థాన్ జానపద గీతాల్ని ప్రారంభించింది. ఉన్నట్లుండి మధ్యలోనే ఆగిపోయింది ఆ ప్రోగ్రాం.

"హెచ్చరిక... భారత పౌరులందరికీ హెచ్చరిక..." అంటూ వినవచ్చింది గంభీరమైన కంఠం ఒకటి.

ఉలిక్కిపడి అంబాసిడర్‌ని ఆపాడు సుల్తాన్. చెవులు రిక్కించుకొని ఆ మాటల్ని వినటం మొదలుపెట్టాడు.

"‥‥ గత రెండు మాసాలనుంచీ దేశంలో దొంగనోట్ల చలామణీ తీవ్రతరం అయినట్లు ప్రభుత్వపు దృష్టికి రాబడింది. మన ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేయటానికి దేశద్రోహులు పన్నిన కుట్ర యిది. ఈ రోజునుంచీ పది రూపాయల నోట్లను చలామణీలో నుంచి రద్దు చేయటానికి ప్రభుత్వం నిర్ణయించుకుంది. దేశంలోకి వస్తున్న దొంగనోట్లు అన్నీ పది రూపాయల డినామినేషన్‌లో వుండటం వల్ల విధిలేక యీ నిర్ణయాన్ని తీసుకోవటం జరిగింది. ఈ రోజునుంచీ పది రూపాయల నోట్లను వుపయోగించవద్దని, ఎవరి దగ్గిర వున్న నోట్లను వాళ్ళు భద్రపరుచుకొని, ప్రభుత్వం మరో ప్రకటన చేసే దాకా వేచియుండమనీ భారతీయులను వేడుకుంటున్నాం. పది రూపాయల నోట్లను ఎవరు యిచ్చినా తీసుకోవద్దు. ఎవరికీ మీరు యివ్వవద్దు... పూర్తి వివరాలు తెలుసుకోదలిచిన వారు సమీపంలో వున్న పోలీసు అధికారులను సంప్రదించవచ్చు..."

ఎంత హఠాత్తుగా ఆరంభం అయిందో అంతే హఠాత్తుగా ఆగిపోయింది ఆ కంఠం. వెంటనే ప్రారంభం అయింది నిలిచిపోయిన ప్రోగ్రాం.

సిగరెట్ వెలిగించుకొని అంబాసిడర్‌ని ముందుకు పోనిస్తూ తనలో తను పెద్దగా నవ్వుకున్నాడు సుల్తాన్.

పది రూపాయల నోట్లను చలామణీలో నుంచి రద్దుచేయటం అంటే, సినిమాకు పోయి వచ్చినంత తేలిక అని అనుకుంటున్నారు కాబోలు ప్రభుత్వ

అధికారులు... ఇండియన్ కరెన్సీలో అధికశాతం పది రూపాయల డినామినేషన్‌లోనే వుంది. దాన్ని నిలుపు చేస్తే దద్దరిల్లిపోతుంది దేశం... గీ పెట్టేస్తారు ప్రజలు.

డిక్కీలో పెట్టిన సూట్‌కేసులను తలుచుకొని ముసిముసి నవ్వులు నవ్వుతున్నాడు సుల్తాన్... ఇటువంటి హెచ్చరికలు ఒకటి కాదు... వంద చేసినా తనకు భయం లేదు. ఇంకో వారం పది రోజుల్లో తను లక్షాధికారి కాబోతున్నాడు...

అంబాసిడర్‌ని మరోసారి ఆపి, మనోరంజన్ దాస్ యిచ్చిన సారా సీసాను పాంటు జేబులో నుంచి తీసి, మరో రెండు గుక్కలు వేశాడు సుల్తాన్.

క్రిందికి దిగబోతున్న నిషా మళ్ళీ టాప్‌కి పోయి కూర్చుంది. హుషారుగా విజిల్ వేసి యాక్సిలేటర్‌ని బలంగా అదిమాడతను. కళ్లెం విడిచిన గుర్రంలా ముందుకు దూకింది అంబాసిడర్.

అదే సమయంలో అటుగా వచ్చింది ఒక లారీ. బ్రేకులు వేయటానికి ప్రయత్నించాడు సుల్తాన్. స్టీరింగ్‌ని గట్టిగా పట్టుకొని బలమంతా ప్రయోగించి పక్కకి తిప్పాడు. సారా నిషా మూలంగా చాలా ఆలస్యంగా కదిలాయి అతని అవయవాలు.

డబ్‌మని శబ్దంచేస్తూ లారీకి గుద్దుకొని నిట్ట నిలువుగా పైకి లేచింది అంబాసిడర్. అంతటితో ఆగకుండా పల్టీలు కొడుతూ పోయి రోడ్ ప్రక్కనే వున్న గోతిలో పడింది.

కీచుధ్వనులు చేస్తూ వంద గజాల దూరం పోయి ఆగింది లారీ. ముఖానికి పట్టిన చమటల్ని తుడుచుకుంటూ వెనక్కి చూశాడు దాని డ్రయివర్. పల్లంలోకి దొర్లిన కారులో నుంచి ఎటువంటి శబ్దమూ వినరాలేదు. మరో రెండు నిముషాల పాటు అలాగే చూసి, వున్నట్లుండి లారీని ముందుకు పోనిచ్చాడతను.

రెండు గంటల తరువాత కాపు సారా కేసుల్ని పట్టుకోవటానికి బయలుదేరిన యిన్స్పెక్టర్ జగజ్జీత్ సింగ్ అటుగా వచ్చి పల్లంలో పడిపోయిన అంబాసిడర్ని గమనించాడు.

పప్పుపప్పు అయిపోయింది దాని ముందుభాగం. తల పగిలి స్టీరింగ్ మీద వాలిపోయి ఉన్నాడు సుల్తాన్ అహమద్. అతని ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసి చాలా సేపు అయింది. అతని ప్రక్కనే పడివున్న సారా బాటిల్ని చూడగానే బరువుగా నిట్టూర్చి తల విదిలించాడు జగజ్జీత్ సింగ్.

అంతలోనే అతని దృష్టి అంబాసిడర్ వెనుక భాగం మీద పడింది. సుత్తులు పెట్టి కొట్టినట్లు సొట్టలు పడి తనంతట తనే ఓపెన్ అయింది డిక్కీ. అందులో వున్న సూట్కేసులు రెండూ క్రింద పడిపోయాయి.

బూటు కాలితో ఒక సూట్కేస్ని బలంగా తన్నాడు జగజ్జీత్ సింగ్ టప్ మని శబ్దంచేస్తూ తెరుచుకుంది అది!

జగజ్జీత్ సింగ్ వూపిరి ఒక్కసారిగా కట్ అయినంత పని జరిగింది. తను కల కంటున్నాడేమో అన్న అనుమానం వచ్చి చేతిని గట్టిగా గిల్లుకున్నాడు. కళ్లను రెండు సార్లు నులుముకొని చూశాడు.

కల కాదు భ్రమ కాదు.

పెళ పెళ లాడుతున్న పది రూపాయల కట్టలు టైట్గా పేర్చబడి వున్నాయి ఆ సూట్కేసుల నిండా. జగజ్జీత్ సింగ్ వులికిపాటును గమనించి వెక్కిరిస్తున్నట్లు గాలికి చెదిరి పల్లంలోకి దొర్లింది లూజ్గా వున్న కట్ట ఒకటి.

* * *

# కౌంటర్‌ఫీట్ కిల్లర్

మసక చీకట్లు పాకిస్థాన్ సరిహద్దును ఆవరించుకుంటున్న సమయంలో దుమ్ము తెరల్ని రేపుతూ వచ్చి ఒక చెట్టు క్రింద నిలబడింది ఆర్మీ జీప్ ఒకటి.

వెనుక సీటులో కూర్చుని వున్న షాడో వెంటనే క్రిందికి దిగి, సిగరెట్ వెలిగించుకుంటూ చుట్టూ చూశాడు.

రెండు ఫర్లాంగుల దూరంలో సుడులు తిరుగుతూ ప్రవహిస్తోంది మాఘీనది. దాన్ని దాటితే పాకిస్థాన్ భూభాగంలో అడుగు పెట్టినట్లే లెక్క.

"నదిని క్రాస్ చేయటానికి యింతకంటే మంచి ప్లేస్ మరొకటి లేదు సార్... మీకోసం పదిరోజుల పాటు యిక్కడే వెయిట్ చేయమని మాకు ఆర్డర్స్ వచ్చాయి." షాడో వెనుకగా నిలబడుతూ మృదువుగా అన్నాడు జీప్‌ని నడిపిన ఆర్మీ ఆఫీసర్.

మౌనంగా తలవూపి ముందుకు అడుగు వేశాడు షాడో. రెండు నిముషాల్లో నదిని సమీపించి నిశ్శబ్దంగా నీటిలోకి జారాడు.

వెంటనే అతన్ని తనలోకి లాక్కుంది ప్రవాహం. పూల చెండును కొట్టినట్లు విసిరి విసిరి కొడుతూ ముందుకు లాక్కుపోయింది.

పావుగంట తరువాత అవతలి వడ్డును సమీపించాడు షాడో. కళ్లల్లోకి జారుతున్న నీటి బిందువుల్ని ఎడమ చేత్తో విదిలించుకుంటూ, కుడిచేతిని వడ్డు మీద వేశాడు.

"ఎవరిది?" ఖంగుమంటూ వినవచ్చిందొక ఛాలెంజి.

ఎలా వున్నవాడు అలాగే శిలా విగ్రహంలా బిగుసుకుపోయాడు షాడో. ఎక్కడో ఏదో పొరపాటు జరిగింది. మాఘీనది వడ్డున పెట్రోల్ చేసే పాకిస్థాన్ సైనికులుసాయం సమయాల్లో తమ కాంప్‌లను వదిలిపెట్టి యువతలకు రారని ఆర్మీ యింటలిజెన్స్ తెలియచేసింది. మరి నదిని పూర్తిగా దాటకముందే ఎదురైన యీ ఛాలెంజి మాటేమిటి?

"ఎవరని అడిగితే సమాధానం చెప్పరేం? నదిలో వున్నది ఎవరు?" కరుకుగా అడుగుతూ పొదల చాటునుంచి లేచి నదిలోకి తొంగిచూశాడు ఒక పాకిస్థాన్ సిపాయి.

శరవేగంతో ఆలోచిస్తోంది షాడో అంతరంగం. వంటరిగా లేడు ఆ సిపాయి. వెంట మరో నలుగురు వున్నారు. ఆకలిగా నోళ్ళు తెరుచుకు చూస్తున్న సబ్ మెషీన్ గన్స్ వారందరి దగ్గిరా వున్నాయి.

"మాఘీనది రొయ్యలు చాలా రుచిగా వుంటాయని విన్నాను సాబ్... అల్లా చల్లగా చూస్తే యీ రాత్రికి రొయ్య చారు తాగాలని మహాకోరికగా వుంది..." అమాయకంగా ముఖం పెట్టి ఆ సిపాయి వంక చూస్తూ అన్నాడు.

రెండు అడుగులు ముందుకు వేసి ముఖంలోకి పట్టి పట్టి చూశాడు ఆ సిపాయి. వున్నట్లుండి చేతిలోని గన్‌ని వెనక్కి తిప్పి షాడో భుజాల మీద బలంగా మోదాడు.

"మర్ గాయారే.. మై మర్ గయా!" అని బిగ్గిరిగా అరిచాడు షాడో. అరుస్తూనే వడ్డు మీదికి పోయి నెత్తి నోరు కొట్టుకుంటూ పొదల మధ్య చతికిలపడ్డాడు.

"నోరు మూస్తావా... యింకో రెండు అంటించమన్నావా?" గన్‌ని పైకి ఎత్తుతూ క్రూరంగా అడిగాడు ఆ సిపాయి.

చటుక్కున నోరు మూసుకున్నాడు షాడో. చేతుల్ని నెత్తి మీద పెట్టుకుని వారందరి వంకా దీనంగా చూశాడు.

పైకి ఎత్తిన గన్‌ని క్రిందికి దించుతూ ఆలోచనలో పడ్డాడు ఆ సిపాయి. మాఘీనదిలో చేపలు పట్టుకుని సరిహద్దు గ్రామాల్లో అమ్ముకొని జీవించే జాలర్లు చాలా మంది వున్నారు ఆ చుట్టుపట్ల.

చినిగిపోయిన పైజామా, పెద్ద పెద్ద కంతలు పడిన బనీను, పాతిక అతుకులతో తయారు చేయబడిన కాకీ షర్టు, ఇవాళో రేపో తెగిపోయేటట్లున్న పాత వల... పాకిస్థాన్ జాలర్ల కంటే పరమ చండాలంగా వుంది షాడో అవతారం.

"ఆల్ రైట్.. ఈ ఒక్కసారికి నిన్ను వదిలేస్తున్నాం. చీకటి పడిన తరువాత యింకెప్పుడైనా యిటుగా వచ్చావంటే కాళ్ళు చేతులు విరగగొట్టి నదిలో పారేస్తాం. భాగ్ జావ్..." అంటూ గన్‌ని తిరగేసి షాడో భుజాలమీద మరోసారి బాదాడు ఆ సిపాయి.

బ్రతుకు జీవుడా అనుకుంటూ లేచి, పొదల మధ్య గా పరుగు తీశాడు షాడో. రెండు ఫర్లాంగుల దూరం పోగానే అటూ, యిటూ, చూసి, భుజంమీద వున్న వలను ఒక పొద చాటుకు విసిరేశాడు. తలకు చుట్టుకొని వున్న చినుగుల తలపాగాను వూడతీసి అందులో భద్రంగా దాచి వుంచిన వాలెట్‌ని పైజమాజేబులో పెట్టుకున్నాడు.

బయలుదేరిన పనిలో మొదటి భాగం ఎటువంటి గొడవలు లేకుండా పూర్తి అయింది. బోర్డర్ సిపాయిలను ఏమార్చి పాకిస్థాన్ భూభాగంలో అడుగుపెట్టగలిగాడు. ఆ తరువాత?

ఆ మాట అనుకోగానే ఆ ప్రయత్నంగా నాలుగు రోజులు వెనక్కి మరలాయి అతని ఆలోచనలు.

ఆ రోజు.. అలక పాన్పు ఎక్కిన బిందును మంచి చేసుకోవటానికి పడరాని పాట్లు పడుతున్న సమయంలో అర్జంట్‌గా బయలుదేరి రమ్మని మెస్సేజి పంపారు కులకర్ణి.

మోకాలి ఎత్తున పెరిగివున్న ముళ్ళ పొదల మధ్యగా దారి చూసుకుంటూ, పాతికమైళ్ళ దూరంలో వున్న కబూతర్ సిటీ వైపు అడుగులు వేస్తున్న షాడో కనుల ముందు ఆ రోజు జరిగిన సంఘటనలన్నీ సినిమారీళ్ళ మాదిరి కదలాడటం ప్రారంభించాయి.

* * *

"... మైడియర్ జంటిల్మన్... వెంటనే ఏదో ఒకటి చేసి యీ కౌంటర్‌ఫీట్ కరెన్సీని సర్క్యులేషన్‌లో నుంచి తొలగించకపోతే మనం జాగ్రత్తగా మెయింటైన్ చేసుకు వస్తున్న ఆర్థిక వ్యవస్థ అధోగతి పాలైపోతుంది.." మాటల్ని తూచి తూచి వాడుతూ అన్నాడు ఆర్థికమంత్రి.

ఆయన ముందు కూర్చుని వున్న స్పెషల్ బ్రాంచి అధికారులు, ప్రభుత్వ ప్రతినిధులు అందరూ ఒకరి ముఖాలు ఒకరు చూచుకొని మౌనంగా వుండిపోయారు.

"అసలు ఈ కరెన్సీ ఎక్కడినుంచి వస్తుందో, ఎలా సర్క్యులేట్ చేయబడుతున్నదో ఎంత ఆలోచించినా మాకు అర్థం కావటంలేదు. మీకు కూడా అర్థంకాలేదని నాకు క్లియర్‌గా తెలుస్తూనే వుంది..." ఖంగుమంటున్న కంఠంతో అన్నారు ఫైనాన్స్ మినిస్టర్.

ఆయనకు రెండు అడుగులు యివతలగా కూర్చుని వున్న స్పెషల్ బ్రాంచి డైరెక్టర్ ముఖం ఎర్రగా కందిపోయింది ఆ మాటల్ని వినగానే.

"మన్నించాలి సార్... మక్కిన్ ఖోలా ట్రంక్ రోడ్ మీద మనకు రెండు సూట్ కేసులు దొరికాయి. సుల్తాన్ అహమద్ అనే పాకిస్థాన్ స్మగ్లర్ పేరు తెలిసింది. ఆ క్లూల ఆధారంగా పాకిస్థాన్‌లోకి పోయారు మా సి.ఐ.డి.లు... త్వరలోనే వాళ్ళ దగ్గర్నించి మెస్సేజి వస్తుంది..." అన్నాడతను. అలా అంటుండగానే తెల్లటి యూనిఫాం ధరించిన ఒక సర్వెంట్ ఆ గదిలోకి వచ్చి అతని చెవిలో ఏదో చెప్పాడు.

థౌజండ్ కాండిల్ బల్బు మాదిరి వెలిగింది స్పెషల్ బ్రాంచి డైరెక్టర్ ముఖం. "జంటిల్మెన్... మా సి.ఐ.డి.లు పాకిస్థాన్ నుంచి తిరిగి వచ్చారు... వారి ఫైండింగ్స్ మీరు కూడా విందురు గాని..." అంటూ ఆ సర్వెంట్‌కి సైగచేశాడు.

రెండు నిముషాల తరువాత నెమ్మదిగా ఆ గదిలోకి వచ్చారు ఇద్దరు సి.ఐ.డి.లు. మృత్యు ముఖంలో నుంచి తప్పించుకొని వచ్చినట్లు తెల్లగా పాలిపోయి వున్నాయి వారి ముఖాలు.

"ఏమయింది? సతీష్ చంద్ర ఎక్కడికి పోయాడు?" వారి వంక ఆశ్చర్యంగా చూస్తూ అడిగాడు స్పెషల్ బ్రాంచి డైరెక్టర్.

ఆ సి.ఐ.డి.లతో పాటు సతీష్ చంద్ర అనే స్పెషల్ డిటెక్టివ్ కూడా పాకిస్థాన్ వెళ్ళాడు. కౌంటర్‌ఫీట్ నోట్లను గుర్తుపట్టటంలో అందెవేసిన చేయి అతనిది.

"క్షమించాలి సార్... మా మిషన్ ఫెయిల్ అయింది. సతీష్ చంద్ర మాయం అయిపోయాడు. పాకిస్థాన్ ఏజెంట్లు మమ్మల్ని మట్టు పెట్టటానికి ప్రయత్నించటం వల్ల వెనుతిరిగి వచ్చేశాం" వంచుకుంటూ తడబడుతున్న కంఠంతో చెప్పాడు ఒక సి.ఐ.డి.

ఏమని కామెంట్ చేయాలో అర్థంకాక రాతిబొమ్మలా కూర్చుండి పోయాడు స్పెషల్ బ్రాంచి డైరెక్టర్.

అతని ముఖంలో ప్రతిఫలిస్తున్న భావాలను గమనించి మృదువుగా నవ్వారు ఆర్థిక మంత్రి. "ఇట్సాల్ రైట్ మై ఫ్రండ్.... మనం ప్రారంభించిన పనులన్నీ విజయవంతం అవుతాయని గారెంటీ లేదు. సమర్థులైన సి.ఐ.డి.లను మరి కొందర్ని వెంటనే పంపించండి... ఏదో ఒక విధంగా కౌంటర్‌ఫీట్ ఫ్లోని అడ్డుకోండి." అన్నారాయన కుర్చీలోనుంచి లేచి నిలబడుతూ.

ఒకరి తరువాత ఒకరుగా కుర్చీలలో నుంచి లేచి సెలవు తీసుకున్నారు అక్కడ సమావేశం అయివున్న వారందరూ. తన సి.ఐ.డి.లను వెంటబెట్టుకొని హెడ్‌క్వార్టర్స్‌కి వెళ్ళిపోయాడు స్పెషల్ బ్రాంచి డైరెక్టర్.

రెండు నిముషాల పాటు ఆ గదిలోనే పచార్లుచేసి, టేబిల్ మీదవున్న ఫోన్ అందుకున్నారు ఆర్థికమంత్రి

"యూ బెటర్ కాల్ ది సి.ఐ.బి. చీఫ్... షాడోని తీసుకొని వెంటనే నా బంగ్లాకు రమ్మన్నానని పర్సనల్‌గా పోయి చెప్పు..." అంటూ రిసీవర్‌ని పెట్టేశారాయన.

* * *

"హేయ్! ఎవరు నువ్వు?" ఖంగుమంటున్న కంఠం ఒకటి బిగ్గరిగా వినరావటంతో వులిక్కిపడి ముందుకు చూశాడు షాడో.

కబూతర్ సిటీకి పోయే ట్రంకురోడ్ అతని ఎదుట కనిపించింది. రోడ్ మధ్య ఆగి వుంది రెండెడ్ల బండి ఒకటి. లావాటి వసికర్రను పట్టుకొని షాడో వంకే చూస్తున్నాడు ఆ బండీ ముందు భాగంలో కూర్చుని వున్న లావుపాటి వ్యక్తి.

"పట్టణంలోకి పోతున్నాను భాయీ సాబ్... నీకు అభ్యంతరం లేకపోతే బండి ఎక్కుతాను..." తన ఆలోచనలన్నిటినీ వెనక్కు నెట్టి అతని ముందుకు పోతూ అన్నాడు షాడో.

అతని అవతారాన్ని గమనించి అసహ్యంగా నొసలు విరుస్తూ అలాగేనని తల వూపాడు బండి యజమాని మహదానందంగా ఎక్కి కూర్చున్నాడు షాడో. మెడలకు కట్టిన మువ్వల్ని గణ గణలాడిస్తూ కదిలాయి ఎడ్లు. తూర్పు దిక్కు తెల్లబడుతున్న సమయంలో కబూతర్ సిటీలో అడుగుపెట్టాయి.

"ఎక్కడికి పోవాలి తమ్ముడూ? అసలు నువ్వు ఏం పని చేస్తావ్?" ఎర్రబడిన కళ్ళను నులుముకుంటూ బండి దిగుతున్న షాడోని అడిగాడు బండి యజమాని.

"ఈసారి కలిసినప్పుడు ఆ విషయాలన్ని వివరంగా చెప్తాను. ఇప్పుడు నాకు అర్జంటు పని ఒకటి వుంది." అంటూ పరుగులాంటి నడకతో ఒక సందులోకి పోయి అదృశ్యం అయినాడు షాడో.

"సువ్వర్ కీ బచ్చా... వట్టి సోమరిపోతు మాదిరి కనిపిస్తున్నాడు. ఇటువంటి బద్మాష్‌లు వుండబట్టే దేశం యిలా నాశనం అయిపోతోంది" తనలో తను అనుకుంటూ తన దారిన తను వెళ్ళిపోయాడు బండి యజమాని.

## 2

సూర్యుడు నడినెత్తి మీదికి చేరుకుంటున్న సమయంలో కబూతర్ సిటీ ఏరియాలోకి పోయాడు షాడో. లక్షలమీద జరుగుతుంటూ వుంటుంది అక్కడ వ్యాపారం. సిటీలో వుండే రఫ్ క్యారెక్టర్లన్నీ ఆ పరిసరాల్లోనే తచ్చట్లాడుతూ వుంటాయి.

తడికలతో కట్టబడిన ఒక టీ బంక్ లో రెండు ఎండు రొట్టెల్ని తిని, రెండు కప్పుల టీ తాగాడు. ఇండియానుంచి స్మగుల్ చేయబడిన తాజ్ మహల్ బీడీ వెలించుకొని టీ బంక్ దగ్గిరేవున్న చెట్టుక్రింద బిచాణా వేశాడు.

చూస్తూ వుండగానే వేగంగా నడిచిపోయింది టైం. సూర్యుడు పడమటిదిశకు మరలాడు. షాడో కూర్చుని వున్న చెట్టుకు వందగజాల దూరంలో చిన్న రేకుల షెడ్ ఒకటి వుంది. అందులో నుంచి యిద్దరు దృఢకాయులు బయటికి వచ్చి అతని వైపు సైగచేశారు.

తలకు చుట్టుకొని వున్న చినుగుల గుడ్డను విదిలించి భుజంమీద వేసుకొంటూ వారి దగ్గిరికి పోయాడు షాడో.

"ఏం పని చేస్తావ్ బే నువ్వు?" క్రింది నుంచి పైదాకా పట్టి పట్టి చూస్తూ అడిగాడు ఒక దృఢకాయుడు.

"ఏ పనైనా చేస్తాను సాబ్, కడుపునిండా తిండిపెడితే చాలు"

"ఫకీర్ కమాన్ దగ్గిర రెండు బస్తాల మాల్ వుంది. పోలీసులకు తెలియకుండా తీసుకురాగలవా?"

తన నిరీక్షణ ఫలించినట్లు గ్రహించి సంతోషంగా వూపాడు తల షాడో. పాకిస్థాన్‌లో ప్రొహిబిషన్ చాలా తీవ్రతరం అయింది. సారా వ్యాపారం మరణావస్థకు చేరుకుంది. పోలీసులకు తెలియకుండా మాల్‌ని తీసుకురావటం అంటే పులి నోట్లో తలకాయ పెట్టటం లాంటిది.

"షఫీగాడి కొట్లోకి పోయి నీ కడుపు పట్టినంత తిను. ఫకీర్ కమాన్ దగ్గిరికి పదిగంటల కల్లా పోవాలి. తెలిసిందా?" పదిరూపాయల నోటు నొకదాన్ని అందిస్తూ చెప్పాడు రెండో దృఢకాయుడు.

అలాగేనని తల వూపుతూ ఆ నోటును తీసుకొని బయలుదేరాడు షాడో. షఫీగాడి కొట్టు ఎక్కడ వుందో అతనికి తెలియదు. ఫకీర్ కమాన్‌కి ఎటునుంచి పోవాలో ఒకరిద్దర్ని అడిగి తెలుసుకున్నాడు. ఆ తరువాత కబేళా ప్రక్కనే వున్న మిలటరీ హోటల్లో కడుపు నిండా టిఫిన్ పట్టించి, బీడీ వెలిగించుకుంటూ సిటీ లిమిట్స్ వైపుబయలుదేరాడు.

కబూతర్ సిటీకి పది మైళ్ళ దూరంలో వుంటుంది ఒక పాడుబడిన మసీదు. దృఢకాయులు చెప్పిన ఫకీర్ కమాన్ అదే. రాత్రి పదిగంటల ప్రాంతంలో దాన్ని సమీపించి ఒక ప్రక్కగా నిలబడ్డాడు షాడో.

పది నిముషాలు కూడా గడవకముందే నాటు సారా నింపిన మోటారు కారు ట్యూబుల్ని మోస్తూ అక్కడికి వచ్చారు యిద్దరు వ్యక్తులు.

"డబ్బులు తీసుకు వచ్చావా?" షాడోని చూడగానే అడిగాడు వారిలో ఒకతను.

"డబ్బు గిబ్బు జాన్తానై... మాల్‌ని సిటీలోకి చేర్చటం వరకే నా బాధ్యత" సగం కాలిన బీడీని యింకోసారి వెలిగించుకొంటూ అన్నాడు షాడో.

"అచ్ఛాభాయ్... సరుకు తీసుకుని వెళ్ళు... డబ్బు సంగతి మేము దాదాతో మాట్లాడుకుంటాంలే..." అంటూ భుజాలమీద వున్న ట్యూబుల్ని షాడో ముందుపడేసి చీకట్లలోకి పరుగుతీశారు వారిద్దరూ.

షాడో మనస్సులో అనేక రకాల అనుమానాలు మొలకలు వేయటం ప్రారంభించాయి ఆక్షణంనుంచీ జరుగకూడనిదేదో జరుగబోతున్నదన్న భావం అతని అంతరంగాన్ని పట్టి పీడించటం ప్రారంభించింది.

వెంటనే బయలుదేరకుండా, మరో అరగంటసేపు అక్కడే వెయిట్ చేశాడు. ప్రశాంతంగా వుంది ఆ చుట్టుపట్ల వున్న ప్రదేశమంతా. ప్రమాద చిహ్నాలు ఏవీ కంటికి కనిపించటం లేదు.

"ఆల్ రైట్.. రోటిలో తలపెట్టిన తర్వాత రోకటి పోటుకు భయపడటందేనికి?" అనుకుంటూ సారాట్యూబుల్ని తలమీదికి ఎత్తుకుని కబూతర్ సిటీవైపుబయలుదేరాడు.

సారా ట్యూబులు చాలా బరువుగా వున్నాయి. అరగంట కూడా గడవకముందే ఆయాసం షాడోని వుక్కిరి బిక్కిరి చేయసాగింది. శరీరమంతా చమటలతో తడిసిపోయింది.

సిటీ లిమిట్స్‌ని సమీపిస్తుండగా యదార్థ రూపాన్ని ధరించింది అతని అనుమానం. రోడ్డు ప్రక్కనే వున్న చెట్ల చాటు నుంచి పిశాచాల మాదిరి పరిగెత్తుకుంటూ వచ్చారు పదిమంది ప్రొహిబిషన్ యిన్స్‌పెక్టర్లు.

తలమీద వున్న ట్యూబుల్ని ఎత్తి ఒక ఇన్స్‌పెక్టర్ ముఖంమీద పడేశాడు షాడో. దగ్గరికి వచ్చిన ఇంకో ఇన్స్పెక్టర్ గుండెలమీద బలంగా గుద్ది, రోడ్డు ప్రక్కనే వున్న పొదల్లోకి జంప్ చేసాడు.

"పకడో... పకడో..." అని అరిచాడు ఒక ఇన్స్‌పెక్టర్.

"ఖడ్ జావ్... ఆగే బడేతో గోలీ మార్ దూంగా..." అని హెచ్చరించాడు ఇంకొక ఇన్స్‌పెక్టర్. ధనా ధన్ మని దిక్కులు దద్దరిల్లేలా రివాల్వర్స్‌ని ప్రయోగించారు మరో ఇద్దరు.

ఆగలేదు షాడో. ఆగితే తన పని అంతటితో ఆఖరే అని అతనికి కొట్టవచ్చినట్లు అర్థం అవుతోంది. సారా అమ్మిన వాళ్ళ చేతుల్ని నరికిస్తోంది పాకిస్తాన్ ప్రభుత్వం. సారాను సప్లయి చేసే వాళ్ళ గొంతుల్ని పిసికించకుండా వూరుకుంటుందా?

ముళ్ళపొదలకు పట్టుకుని మరింతగా చినిగి పీలికలై పోయాయి అతను ధరించి వున్న సెకండ్ హాండ్ దుస్తులు. అయినా సరే లెక్కచేయకుండా అలాగే ముందుకు పోయాడు. అతన్ని అంతటితో వదిలి పెట్టదలుచుకోలేదు ఇన్స్పెక్టర్లు వేటకుక్కల్లా వెంటపడి తరమటం ప్రారంభించారు.

రెండు గంటల పాటు ఏకబిగిన పరిగెత్తాడు షాడో. ఆయాసంతో ఎగిరెగిరి పడుతున్నది అతని ఛాతీ... విపరీతమైన బడలికతో తడబడటం మొదలు పెట్టాయి అతని పాదాలు.

ఒక రెండు నిముషాల పాటు ఎక్కడైనా ఆగి రెస్ట్ తీసుకోవాలన్న కోరిక అతని మనస్సులో అడుగుపెట్టింది. రెస్ట్ తీసుకోకపోతే ఆ పరుగుపందెంలో తను ఓడిపోవటం తప్పనిసరి అని కూడా అతనికి అర్థం అయింది. ప్రొహిబిషన్ ఇన్స్పెక్టర్లకు ఆ పొదలు డొంకలు అన్నీ కొట్టినపిండి. షాడో ఎన్ని గిరికీలు కొట్టినా, ఎన్ని చక్కర్లు వేసినా ఏమీ ప్రయోజనం లేకపోతున్నది.

అలాగే ఓపిక చేసుకొని మరో రెండు గంటల పాటు పరుగుతీశాడు. అలా పరుగుతీస్తున్న సమయంలో అతనికి కనిపించింది చిన్న ఖాళీ స్థలం. దాని మధ్య ఎత్తయిన గడ్డివామి ఒకటి అగుపిస్తోంది. వెనుకా ముందూ ఆలోచించకుండా దాని దగ్గరికి పోయి, ముందు భాగంలో లూజ్‌గా వున్న గడ్డిలో దూరాడు.

రెండు నిముషాల తరువాత ఆయాసంతో వగరుస్తూ అక్కడికి వచ్చారు ప్రొహిబిషన్ ఇన్స్పెక్టర్లు.

"ఇక్కడే ఎక్కడో దాగుకొని వుంటాడు... జాగ్రత్తగా వెతకండి..." అన్నాడు వారిలో ఒకతను.

ఖాళీస్థలం చుట్టూ వున్న పొదల్ని గాలించారు అందరూ! గడ్డివామి మీదికి ఎక్కి లాటీకర్రలతో గడ్డిని బాది చూశారు.

ఊపిరి బిగబట్టి టైట్‌గా ఉండచుట్టుకుని పడుకున్నాడు షాడో. అతనికి సరిగ్గా ఆరంగుళాల దూరంలో నిలబడివున్నాడు ఒక ఇన్స్పెక్టర్. అతని చేతిలోని లాటీకర్ర షాడో ముక్కు మీద ఆనుకొని వుంది.

"దొంగనాయాలు తప్పించుకున్నాడు సార్... షఫీగాడు మనల్ని మోసం చేసాడు..." అంటూ వామి మీది నుంచి దిగారు మిగిలిన వారందరూ.

షాడో మెదడులో అలారం బెల్స్ రింగ్ అవటం ప్రారంభించాయి ఆ మాటల్ని వినగానే ... షఫీగాడు వీళ్ళని మోసం చేయటం ఏమిటి? సారా వ్యాపారం చేసేవాళ్ళతో ఫ్రండ్‌గా నటిస్తూ పోలీసులకు ఇన్ఫర్మేషన్ అందిస్తున్నాడా??

ఖాళీస్థలాన్ని మరోసారి పరిశీలనగా చూసి పొదల్లోకి పోయారు. ఇన్స్‌పెక్టర్లు. వారి బూట్ల శబ్దం దూరంగా పోయేదాకా ఆగి, మెల్లిగా గడ్డిలో నుంచి బయటికి వచ్చాడు షాడో.

సిటీలోకి పోయి షఫీగాడి సంగతి ఏమిటో తేల్చుకోవాలన్న కోరిక అతని మనస్సులో అడుగుపెట్టింది. వెంటనే పరుగులాంటి నడకతో మెయిన్ రోడ్డువైపు బయలుదేరాడు.

తూర్పు దిక్కు తెల్లబడింది అతను మెయిన్ రోడ్డును చేరేసరికి. రోడ్డుమీద అడుగుపెడుతూనే అక్కడ కనిపించిన దృశ్యాన్ని చూసి ఆశ్చర్యంతో చిన్న విజిల్ వేశాడు.

ప్రొహిబిషన్ ఇన్స్పెక్టర్లు వుపయోగించే వాన్ రోడ్డు ప్రక్కనే ఆగివుంది. దానిముందు ఒక టార్పాలిన్‌ని పరుచుకుని గాఢ నిద్రపోతున్నాడు డ్రయివర్. షాడో రోడ్డుమీద పారేసి పోయిన సారా ట్యూబులు రెండూ సురక్షితంగా అతని తల వద్దే వున్నాయి.

తన కోసం బయలుదేరిన ఇన్స్పెక్టర్లు యింకా తిరిగి రాలేదని గ్రహించి, అడుగులో అడుగువేస్తూ, ఆ డ్రయివర్ దగ్గరికి పోయాడు షాడో. నిశ్శబ్దంగా ట్యూబుల్ని ఎత్తుకుని వేగంగా సిటీవైపుపరుగుతీశాడు.

# 3

"ఊరు పేరు తెలియని బద్మాష్ గాళ్ళని నమ్మద్దని మీకు అనేకసార్లు చెప్పాను. వాడు ఆ ట్యూబుల్ని తీసుకొని పారిపోయి వుంటాడు..." బీడీ పొగను గుప్పు గుప్పున వదులుతూ కబూతర్ సిటీలో సారా వ్యాపారం చేసే దాదాతో అన్నాడు షఫీ.

పట్టెడంత వున్న బుర్రమీసాల్ని మెలివేస్తూ తన అనుచరులవైపు చూశాడు దాదా.

"మోసం చేసి పారిపోయే మనిషిలా కనిపించలేదు దాదాసాబ్... మాకు ఎందుకనో అతను తిరిగి వస్తాడనే అనిపిస్తోంది!" అన్నాడు వారిలో ఒకతను.

పెద్దగా నవ్వాడు షఫీ.

"తిరిగి వస్తాడని మీరు అనుకుంటూనే వుండండి... ఈ లోపలవాడు ఆ సారాను అమ్ముకొని ఆ డబ్బుతో జల్సా చేస్తూ వుంటాడు... నా డబ్బు నాకు పారేయండి... నేను అర్జంటుగా వెళ్ళిపోవాలి..." అంటూ లేచి నిలబడ్డాడు.

సిటీ బయటవుండే సారా బట్టీలకు రిప్రజెంటేటివ్‌గా వ్యవహరిస్తూ వుంటాడు షఫీ. వాళ్ళకి వీళ్ళకి మధ్యవర్తి గాపనిచేస్తూ వుంటాడు.

బుర్రమీసాల్ని మెలివేయటం ఆపకుండానే లాల్చీ జేబులో వున్న ఒక నోట్లకట్టను తీసి అతని మీదికి విసర బోయాడు దాదా.

సరిగ్గా అదే సమయంలో సారా ట్యూబుల్ని తీసుకొని అక్కడికి వచ్చాడు షాడో. చమటలతో తడిసిపోయి వున్న అతన్ని చూడగానే దాదా అనుచరుల ముఖాలు కలువపువ్వుల్లా వికసించాయి.

"శహభాష్ బుద్దూ. సరయిన సమయానికి వచ్చావ్..." అంటూ అతని తలమీద వున్న ట్యూబుల్ని అందుకొని షెడ్ వెనక్కి తీసుకుపోయారు వారిద్దరూ.

"దాదాసాబ్... షఫీ అంటే ఎవరు?" షెడ్ లోపలికి వస్తూ అడిగాడు షాడో.

నోట్ల కట్టను అందుకోబోతున్న షఫీ ముఖం తెల్లగాపాలిపోయింది.

"తర్వాత వస్తాను దాదాసాబ్... నాకు అర్జంట్ పని వుంది" అంటూ అవతలికి వెళ్ళబోయాడు.

చటుక్కున అతని దారికి అడ్డం నిలబడి ముఖంమీద బలంగా గుద్దాడు షాడో.

"బాప్ రే బాప్... మై మర్ గయా!" అని అరుస్తూ వెల్లికిలాపడ్డాడు షఫీ.

లాగిపెట్టి అతని డొక్కలో తన్నాడు షాడో. అటూ యిటూ చూసి, ఆ షెడ్‌లో కనిపించిన ఒక పాత సారా బాటిల్‌ని అందుకుని అతని తలమీద కొట్టబోయాడు.

చటుక్కున లేచి అతని చేతిని పట్టుకున్నాడు దాదా.

"తొందరపడటం మంచిది కాదు బుద్దూ... అసలేం జరిగిందో చెప్పకుండా ఇలా ప్రవర్తించటం బాగోలేదు" అన్నాడు అతని చేతిలోని సారా బాటిల్‌ని తీసుకొని అవతలికి విసిరేస్తూ.

"ఇంకా ఏం జరగాలి సాబ్? ఈ దొంగనాయాలు మీ దగ్గిర మహా విశ్వాసంగా ప్రవర్తించి, అవతల పోలీసులకు కబుర్లు అందిస్తున్నాడు... నేను సారా కోసం పోతున్నట్లు పోలీసులకు చెప్పింది వీడే..." అంటూ గడ్డివామి దగ్గర తను విన్న మాటల్ని వివరించాడు షాడో.

కోపంతో ఎర్రబడి పోయింది దాదా ముఖం. ఉన్నట్లుండి ముందుకొచ్చి షఫీ డొక్కలో బలంగా తన్నాడు.

కెవ్వున అరిచాడు షఫీ. అలాగే లేచి కూర్చుని చారెడు రక్తాన్ని కక్కాడు.

"నన్నే మోసం చేస్తావా సువ్వర్ కీ బచ్చే... నా వుప్పు తిని నాకే ద్రోహం తలపెడతావా?" అంటూ అతని జుట్టు పట్టుకొని పైకిలేవదీశాడు దాదా.

ఈసారి అతన్ని ఆపాల్సిన వంతు షాడోది అయింది. అందుకు కారణం లేకపోలేదు. తడికలతో కట్టబడిన టీ దుకాణం దగ్గిర కాపలా నిలబడివున్నాడు దాదా అనుచరుడు ఒకతను. కబేళా ఏరియాలోకి ప్రొహిబిషన్ వాన్ ఏదైనా వచ్చిన మరుక్షణం తన వాళ్ళకి హెచ్చరిక అందచేయటం అతని డ్యూటీ. ఇప్పుడు అతను పెద్దగా విజిల్ వేసి టీ బంక్ ప్రక్కనే వున్న సందులోకి పారిపోయాడు.

ఆ విజిల్ని విన్నాడు షాడో. తల తిప్పి బయటికి చూశాడు.

మ్రోతలు చేస్తూ వస్తున్నాయి రెండు పోలీస్ వాన్లు. షాడోని పట్టుకోవటానికి ప్రయత్నించిన ఇన్స్పెక్టర్లు అందరూ ముందు వాన్ లోనే వున్నారు.

"కమాన్ దాదా సాబ్... పోలీసులు వచ్చేశారు..." అంటూ దాదా చేయిపట్టుకొని షెడ్ వెనక్కి పరుగు తీశాడు షాడో.

రక్తంకక్కుకుంటూ లబలబ లాడుతున్న షఫీ కూడా గబగబా లేచి బయటికి పరుగెత్తబోయాడు

సడన్ బ్రేకుతో షెడ్ ముందు ఆగాయి వాన్లు. చీమల దండులా వాటిలోనుంచి బయటకువచ్చి అతన్ని చుట్టుముట్టారు పోలీసులు.

"పట్టుకోండి సాబ్. దాదా పారిపోతున్నాడు పట్టుకోండి" షెడ్ వెనక్కి చూపిస్తూ కీచుగా అరిచాడు షఫీ.

లాగిపెట్టి అతడి ముఖంమీద గుద్దాడు ఒక ఇన్‌స్పెక్టర్.

"సువ్వర్ కి బచ్చే... పోలీసులకే టోకరా ఇచ్చేటంత మొనగాడివి అయినావా? మమ్మల్ని డబుల్ క్రాస్ చేస్తావా?" అంటూ అతని మెడపట్టుకొని వాన్‌లోకి నెట్టాడు.

లబలబలాడాడు షఫీ. తను నిర్దోషినని మొత్తుకున్నాడు. కొత్తగా వచ్చి దాదాతో చేరిన బుద్ధూ మూలకంగా వారి ప్లానంతా పాడయిపోయిందని వివరించాడు.

ఎన్ని చేసినా ఎన్ని చెప్పినా విని తలలు వూపారే గాని పోలీసులు అతన్ని విడిచిపెట్టలేదు. దాదా కోసం సందులన్ని టినీ గాలించి, వట్టి చేతులతో వెనుతిరిగారు వారందరూ.

## 4

"శహభాష్ బే బుద్ధూ... నీ చురుకుతనం నాకు నచ్చింది. ఇక నుంచీ నా దగ్గిరే వుండు. నీకు కావాల్సినంత జీతం తీసుకో..." షాడో భుజం తడుతూ అన్నాడు దాదా.

ఆ మాటలు కులకర్ణిగారి చెవిన పడితే ఆయన రియాక్షన్స్ ఎలా వుంటాయో వూహించటానికి ప్రయత్నిస్తూ, సంతోషంగా తల వూపాడు షాడో.

పోలీసుల్ని తప్పించుకొని కబూతర్ సిటీ దక్షిణ భాగంలో వున్న ఒక పాతకాలపు మేడలోకి వచ్చారు వారిద్దరూ. దాదా చేసే దొంగవ్యాపారాలన్ని టికీ

హెడ్‌క్వార్టర్స్ వంటిది అది. అతని అనుచరులు దాదాపు పాతికమంది ఎల్లప్పుడూ అక్కడే తచ్చట్లాడుతూ వుంటారు.

వారిలో ఇద్దరు దాదా ముందుకు వచ్చి సలాం చేస్తూ వినయంగా నిలబడ్డారు.

"ఏమిటి బే? ఏం కావాలి?" నవ్వుతూ ప్రశ్నించాడు దాదా.

"బుద్ధూ తీసుకువచ్చిన ట్యూబులు రెండూ అయిపోయాయి. ఇంకో నాలుగైదు ట్యూబులు తెప్పిస్తే చాలా బాగుంటుంది..." అన్నాడు వారిలో ఒకతను.

సాలోచనగా మీసాల్ని మెలివేస్తూ షాడో వైపు తిరిగాడు దాదా.

"ఫకీర్ కమాన్ దగ్గిరికి ఇప్పుడిప్పుడే పోవటం మంచిది కాదు బుద్ధూ... ఇక మనకు మిగిలిన ప్రదేశం రమ్‌జాన్ దర్గా ఒక్కటే... సారా కావాలంటే అక్కడికి పోవాల్సి!" అంటూ ఎందుకో మధ్యలోనే ఆగిపోయాడతను.

రమ్‌జాన్ దర్గా పేరు వినగానే షాడో శరీరం ఝల్లుమంది. అప్రయత్నంగా అతని చెవుల్లో మార్మోగాయి అంతకుముందు కులకర్ణిగారు చెప్పిన మాటలు.

"... మక్కిన్‌భోలా ట్రంక్ రోడ్డు మీద యాక్సిడెంట్‌లో సుల్తాన్ అహమద్ అనే పాకిస్థాన్ స్మగ్లర్ మరణించాడు. అతనికీ మస్తాన్‌పురి సేట్ మనోరంజన్ దాస్ కీ కనెక్షన్స్ వున్నట్లు తెలుసుకుంది స్పెషల్ బ్రాంచి. మనోరంజన్ దాస్‌ని పట్టుకుని ఇంటరాగేట్ చేయటం జరిగింది. కౌంటర్‌ఫీట్ కరెన్సీని గురించి అతనికి ఏమీ తెలియదు. కాని సుల్తాన్ అహమద్ కబూతర్ సిటీకి దగ్గిర్లో వున్న రమ్‌జాన్ దర్గా అనే ప్రదేశానికి చెందిన వాడని, అక్కడ వున్న గాంగ్‌లకు అతనికి చాలా క్లోజ్ రిలేషన్ షిప్స్ వున్నాయని మనకు తెలిసింది. సో... యూ బెటర్ గో టు ది కబూతర్ సిటీ. అక్కడినుంచి ట్రేసింగ్ ప్రారంభించటం మంచిదని నా అభిప్రాయం..."

"ఏమిటి బుద్ధూ ఆలోచనలో పడ్డావ్?" అని దాదా ప్రశ్నించటంతో వులిక్కిపడి యీ లోకానికి వచ్చాడు షాడో.

"అబ్బే... రమ్‌జాన్ దర్గా అంటే లోగడ నేను విన్న కథలు గుర్తుకువచ్చాయి. వాటిని గురించి ఆలోచిస్తున్నాను" అన్నాడు వులికిపాటును కప్పి పుచ్చుకుంటూ.

చేతులు వెనక్కి కట్టుకొని ఆ గదిలో పచార్లు చేయటం ప్రారంభించాడు దాదా. వున్నట్లుండి ఆగి షాడో వైపు చూశాడు.

"నీ మాటల్లో నిజం లేకపోలేదు బుద్ధూ... రమ్‌జాన్ దర్గా చాలా ప్రమాదకరమైన ప్రదేశం... నువ్వు సూటిగా పోయి ట్యూబుల్ని తీసుకుని మళ్ళీ సూటిగా వెనక్కు వచ్చేయాలి... అక్కడ ఉన్న కొండల్లోకి గాని, భవనాల్లోకి గాని పోకూడదు... ఎటువంటి దృశ్యాలు కనిపించినా పట్టించుకోకూడదు..." అంటూ లాల్చీ జేబు లోంచి ఒక నోట్లకట్టను తీసి అతని చేతిలో పెట్టాడు.

షాడో కుతూహలం మరో రెండు మెట్లు పైకి ఎక్కింది. రమ్‌జాన్ దర్గాని గురించి మరికొన్ని వివరాలు తెలుసుకోవాలన్న కోరిక కలిగింది. కాని అందుకు సరియైన అవకాశం అతనికి లభించలేదు. ట్యూబుల్ని తీసుకురావటానికి డబ్బు యిచ్చిన వెంటనే వెనుతిరిగి లోపల గదుల్లోకి వెళ్ళిపోయాడు దాదా.

ఒకళ్ళని అడిగి తెలుసుకోవటం కంటే తనే స్వయంగా పోయి చూడటమే మంచిదన్న నిర్ణయానికి వచ్చి, తన ప్రశ్నలన్నిటినీ తన లోనే దాచుకున్నాడు షాడో.

* * *

"ఐదు ట్యూబులు కావాలా? డబ్బు తీసుకొచ్చావా?" క్రూరంగా చూస్తూ ప్రశ్నించాడు రమ్‌జాన్ దర్గా దగ్గిర బట్టీలను ఆపరేట్ చేసే గాంగ్ మెంబర్.

దాదా యిచ్చిన నోట్లకట్టను తీసి అతని చేతిలో పెట్టాడు షాడో. చిన్న కిరోసిన్ దీపం వెలుగులో ఆ నోట్లను జాగ్రత్తగా లెక్కపెట్టుకుని, ఒక పొద వైపు చేయి చూపించాడు ఆ వ్యక్తి.

ఆ పొద మధ్యలో షాడోకి కనిపించాయి ఐదు సారా ట్యూబులు. వాటిని భుజాల మీదికి ఎత్తుకుని ఒకటొకటిగా మెయిన్ రోడ్డు మీదికి తీసుకువచ్చాడు షాడో. మెయిన్ రోడ్డుకు ప్రక్కన వున్న చెట్లతోపులో నిలబెట్టి వుంది అతని వెంట తెచ్చిన జట్కా బండీ. సారా ట్యూబుల్ని బండీలో పడేసి, బయటకు కనిపించకుండా పచ్చగడ్డితో కప్పాడు.

వచ్చిన పని అయిపోయినట్లు జట్కా గుర్రానికి అర్థం అయింది కాబోలు. తలతిప్పి అతని వంక చూస్తూ చిన్నగా సకిలించింది.

"షట్ యువర్ బ్లడీ మౌత్... మనం వచ్చిన పని యింకా ప్రారంభం కాలేదు బే... కొంచెం ఆగు..." అంటూ దాని నెత్తి మీద అరచేత్తో చరిచి బండిని ముందుకు కదిలించాడు షాడో.

అడుగుల్ని ఎత్తి ఎత్తి వేస్తూ అరేబియా గుర్రం మాదిరి అందంగా పరుగుతీసిందా గుర్రం. అరగంట తరువాత రోడ్డుకు ఆనుకుని వున్న ఒక మట్టిరోడ్డు మీద నిలబడి మళ్లీ చూసింది షాడో వంక.

బండి దిగి కళ్ళేలను చక్రాలకు బిగించాడు షాడో. గుర్రం తల మీద యింకో చిన్న దెబ్బవేసి మట్టిరోడ్డు ప్రక్కనే ఉన్న పొదల్లోకి పోయాడు.

పొదలకు అవతలి ప్రక్క చిన్న చిన్న కొండగుట్టలు అనేకం ఉన్నాయి. వాటి మీదకు ఎక్కి ఆ ప్రదేశాన్నంతా ఒకసారి జాగ్రత్త గాపరిశీలించాలని అతని వుద్దేశ్యం.

కొండగుట్టల్ని సమీపిస్తుండగానే అతని పురోగమనానికి ఏర్పడింది ఒక అంతరాయం.

"ఎవరది?" ఖంగుమంటూ వినవచ్చింది ఒక ఛాలెంజి.

ఎత్తినపాదాన్ని ఎత్తినట్లేక్రిందికి దించి శిలా విగ్రహంలా బిగుసుకు పోయాడు షాడో. కొండ గుట్టల చుట్టూ వున్న పొదల చాటునుంచి పదిమంది దృఢకాయులు లేచి అతన్ని చుట్టుముట్టారు.

"క్ష- క్షమించాలి... సా... సారా ట్యూబుల కోసం వచ్చాను... దారి తెలియలేదు..." వారి చేతుల్లో ఉన్న దుడ్డు కర్రల వైపు చూస్తూ భయం భయంగా అన్నాడు.

అతన్ని క్రింద నుంచి పైదాకా పట్టిపట్టి చూశాడు ఒక దృఢకాయుడు.

"సారా లేదు గీరా లేదు... మళ్ళీ ఇంకోసారి ఇటు వైపువచ్చావంటే మక్కెలు విరిగిపోతాయి..." అంటూ పిడికిలి బిగించి గడ్డంమీద గుద్దాడు ఇంకో దృఢకాయుడు.

నాలుగు అడుగుల దూరం వెనక్కిపోయి పొదల మీదపడ్డాడు షాడో. కళ్ళ ముందు సినిమారీళ్ళ మాదిరి గిర్రున తిరిగాయి టెక్నికలర్ నక్షత్రాలు. షాడో చేత్తో గడ్డాన్ని సవరించుకుంటూ మెల్లిగాలేచి మారు మాటాడకుండా వెనుతిరిగాడు.

తమలో తాము పెద్దగా నవ్వుకుంటూ పొదల చాటుకు వెళ్ళిపోయారు ఆ దృఢకాయులందరూ. పది అడుగులు వేశాడు షాడో. ఒక్కసారి కూడా వెనక్కి తిరిగి

చూడలేదు. పదకొండో అడుగు వేయబోతూ, చటుక్కున పక్కకు తిరిగి ఒక పొద చాటు డైవ్ చేశాడు.

అప్పుడే ఆ పొద చాటునుంచి అవతలకు పోతోంది పెద్ద జెర్రిగొడ్డు ఒకటి. తన ప్రాణాలు తీసేటందుకు వచ్చాడని భ్రమపడి తల ఎత్తి బుస్సుమని శబ్దంచేసింది.

"గోల వేయకు తల్లీ - నీ దారిన నువ్వుపో... నా దారిన నేను పోతాను... మనలో మనకు ఎందుకు విరోధం?" అంటూ చటుక్కున ప్రక్కకు దొర్లి యింకో పొద చాటుకు పోయాడు షాడో.

మరో రెండు క్షణాలు అతని వంకే చూసి తలవంచుకొని తన దారిన తను పోయింది ఆ పాము. దాని వెనుకే ముందుకు జరిగాడు షాడో. పాము మాదిరిగానే శబ్దం కాకుండా మోచేతుల మీద పాకుతూ కొండగుట్టల్ని సమీపించాడు.

అతన్ని బెదిరించి పంపిన దృఢకాయులు పొదల వెనుక కూర్చుని కునికిపాట్లు పడుతున్నారు. వారికి పది అడుగుల దూరంలో నుంచి పాకుతూ, కొండ గుట్టలమీదికి పోయాడు అతను.

ఎప్పుడో పురాతన కాలంలో అందమైన వుద్యానవనాలు, విశ్రాంతి మందిరాలతో నిండి ఉండేదిట ఆ రమ్‌జాన్ దర్గా. మొగలాయీ చక్రవర్తుల కాలం నాటిమాట అది. ఇప్పుడు ఆ వుద్యానవనాలన్నీ దయ్యాలకు భూతాలకు ఆలవాలమయినాయి.

కొండ గుట్టలమీద ఒక పెద్ద బండరాయి చాటున కూర్చుని నాలుగు ఫర్లాంగుల దూరంలో ఉన్న ఒక భవనం వైపు చూశాడు షాడో. చిమ్మ చీకటితో నిండి ఉండాల్సిన ఆ భవనంలో మినుకు మినుకు మంటూ కనిపిస్తున్నాయి కొన్ని దీపాలు.

షాడో కుతూహలం మరో రెండు మెట్లు పైకి ఎక్కింది. అప్రయత్నంగా జేబులో చేయిపెట్టి జాగ్రత్త గాదాచుకున్న వాలెట్ ని తీసాడు. అందులో భద్రపరిచి వుంది అతని రిస్ట్ వాచి. ఇప్పుడది రాత్రి రెండు గంటల్ని సూచిస్తోంది.

మరో రెండు గంటల దాకా ఆ పరిసరాల్లో తచ్చట్లాడవచ్చు. సారా ట్యూబులకోసం తెల్లవారేదాకా ఎదురుచూడరు దాదా అనుచరులు.

వాలెట్ ని తిరిగి జేబులో పెట్టుకుంటూ బండల చాటునుంచి లేచి ముందుకు జరిగాడు. మరుక్షణం దిక్కులు దద్దరిల్లిపోయేటట్లు వినవచ్చింది రైఫిల్ మ్రోత.

అదిరిపడి వెనక్కి దూకాడు షాడో. అంతవరకూ అతను నిలబడిన ప్రదేశంలోనుంచి అవతలికి దూసుకుపోయింది రైఫిల్ బుల్లెట్.

రైఫిల్ శబ్దం కొండ గుట్టల్లో ప్రతిధ్వనించడం పూర్తి కాక ముందే వినవచ్చాయి కొన్ని అరుపులు.

"పట్టుకోండి... గుట్టల మీద వున్న రాస్కెల్ కాళ్ళు చేతులు విరిచి తీసుకురండి..." ఖంగుమంటూ ఆర్డర్లను జారీ చేసింది ఒక కంఠం.

పిశాచాల మాదిరి గుట్టలు ఎక్కటం ప్రారంభించారు కొందరు వ్యక్తులు. ఇవతలి వైపునకునికిపాట్లు పడుతున్న దృఢకాయులు కూడా పరుగు పరుగున పైకి వచ్చారు.

ఇక అక్కడే వుంటే మర్యాద దక్కదని గ్రహించాడు షాడో. రమ్ జాన్ దర్గాలో దాగి వుంది ఏదో రహస్యం. దాన్ని చేధించాలంటే ప్రాణాల మీది ఆశలు వదిలి పెట్టుకొని ఆ ప్రదేశంలో అడుగుపెట్టాలి.

ఆ పనేదో తీరికగా చేయొచ్చని నిర్ణయించుకొని, గుట్టల మీదినుంచి క్రిందికి దొర్లాడు షాడో. అతని ప్రక్కనుంచే పైకి పోయారు నలుగురు దృఢకాయులు. ఫుట్ బాల్ మాదిరి దొర్లుతూక్రిందికి పోతున్న షాడో వారికి కనిపించలేదు.

పొదల్లోకి పోయి పడగానే, వంటికి అంటిన మట్టి విదిలించుకుంటూ లేచి మట్టి రోడ్డు వైపుపరుగుతీశాడు షాడో.

అసహనంగా నేలను గీరుతూ అతని కోసమే ఎదురు చూస్తోంది జట్కా గుర్రం.

"సారీ మై ఫ్రండ్... పోయిన పని సానుకూల పడలేదు... పద పోదాం" అంటూ ఒక్క గంతులో బండీ ఎక్కి గుర్రాన్ని అదిలించాడు.

నాలుగు కాళ్ళ మీద గాలప్ వేసింది గుర్రం. తూర్పు దిక్కు తెల్లబడుతున్న సమయంలో అతన్ని, సారా ట్యూబుల్ని హెడ్క్వార్టర్స్ ముందుకు చేర్చింది.

## 5

"ఏమిటి బే బుద్ధూ? నీ గడ్డంమీద దెబ్బ ఎలా తగిలింది? వళ్ళంతా గీచుకుపోయిందేమిటి?" షాడోని చూడగానే సూటిగా అడిగేశాడు దాదా.

అటువంటి ప్రశ్నలకు సమాధానం చెప్పవలసి వస్తుందని ముందుగానే రెడీ అయినాడు షాడో.

"జట్కా గుర్రం వట్టి పొగరుమోతుది సాబ్... రెండు సార్లు క్రింద పడేసింది..." అన్నాడు తడుముకోకుండా.

"అచ్చా... యిక మీదట జాగ్రత్త గావుండు. యింకో రెండు రోజులదాకా నీకు పని ఏమీ లేదు. హాయిగా పడుకొని నిద్రపో..." అంటూ అవతలికి వెళ్ళిపోయాడు దాదా.

తేలిగ్గా నిట్టూర్చి ఖాళీగా వున్న ఒక గదిలోకి పోయాడు. షాడో. తలకు చుట్టుకున్న చినుగుల గుడ్డను నేలమీద పరుచుకొని మాట్లాడకుండా పడుకొన్నాడు. పది నిముషాల తరువాత అతన్ని ఆవహించింది నిద్రాదేవత. అంతలోనే వెన్ను మీద ఎవరో తట్టినట్లు వెంటనే వచ్చేసింది మెలకువ.

అందుకు కారణాన్ని అన్వేషిస్తూ కనులువిప్పి చుట్టూ చూశాడు. ఆగదిలో అతనికి ఏమీ కనిపించలేదు కాని ప్రక్క గదిలోంచి వినవచ్చాయి కొన్ని మాటలు.

". . . బాగా విచారించిన తర్వాతే నీ దగ్గిరికి వచ్చాం దాదా... గత రాత్రి రమ్‌జాన్ దర్గాలో సారా ఖరీదు చేసింది నీ అనుచరుడే... యింకెవరూ రాలేదు... సారా కోసం వచ్చిన మనిషి తన పనేదో తను చూసుకొని పోకుండా కొండల్లో తిరిగి చేయరాని గోల చేశాడు. అతనెవరో మాకు చూపించు..." ఖంగుమంటున్నది ఒక కరుకు కంఠం.

ఆ కంఠాన్ని వినేసరికి షాడో గుండెలు వేగంగా కట్టుకోవటం మొదలుపెట్టాయి.

". . . ఆలోచించటం అనవసరం దాదా... మా విషయాల్లో జోక్యం కలిగించుకుంటే మేము వూరుకునేది లేదు. ముందు అతన్ని పిలిపించు..." మరింత పట్టుదలగా అన్నది యింకొక కంఠం.

ఇక దాదా దగ్గిర పనిచేసే అవకాశం చేజారిపోయిందని గ్రహించాడు షాడో. తనను చూసిన మరుక్షణం గుర్తు పట్టేస్తారు ఆ వ్యక్తులు. చడీ చప్పుడు లేకుండా ఖతం చేసి ఏ డ్రయినేజి లోనో పడేస్తారు.

క్రింది పరిచిన తలపాగాను చల్లగా విదిలించి భుజం మీద వేసుకుంటూ నిశ్శబ్దంగా ఆ గదిలోంచి బయటికి వచ్చాడు. అదే సమయంలో పెద్దగా చప్పట్లు కొట్టి, ఇంటి ముందున్న తన అనుచరుల్ని పిలిచాడు దాదా.

"అరే బుద్ధూ... నిద్రపోవటం అప్పుడే పూర్తయిందా" షాడోని చూసి నవ్వుతూ పలకరించి లోపలి గదిలోకి పోయారు యిద్దరు అనుచరులు.

ఊపిరి బిగపట్టి వరండా మెట్లు దిగాడు షాడో.

"పిలవండి ఆ బుద్ధూ గాడిని... రాత్రి ఏదో గోల చేసి వచ్చాట్ట... పిలవండి" ఖంగుమంటూ అతని చెవులకు సోకింది దాదా కంఠం.

రెండు అంగల్లో వీధిని సమీపించాడు షాడో.

"అరే బుద్ధూ... ఆగు... ఆగు" హడావుడిగా పిలిచాడు ఒక అనుచరుడు.

ఆగే ఆలోచన షాడోకి ఎంతమాత్రమూ లేదు. వీధిలో అడుగు పెట్టిన మరుక్షణం పిక్కబలం చూపించాడు. వింటి నుంచి వెలువడిన బాణంలా వేగంగా పోయి ప్రక్క వీధిలో వున్న ఒక చిన్న టీ బంక్ లోకి పోయి కూర్చున్నాడు.

అరగంట తరువాత అటుగా వచ్చారు దాదా అనుచరులు అరడజను మంది. ఆ వీధిలో నడుస్తున్న పౌరులందర్నీ జాగ్రత్తగా గమనిస్తూ వీధి చివర వున్న చిన్న సందులో మాటు వేసి నిలబడ్డారు.

పది నిముషాలకు ఒక చాయ్ చొప్పున అరడజను చాయ్‌లు తాగాడు షాడో. డజను ఎండు రొట్టెల్ని తిన్నాడు. ఇంకో రెండు చాయ్‌లు తాగేవాడే కాని అప్పటికే బంక్ యజమాని అతని వంక అనుమానంగా చూడడం మొదలుపెట్టాడు.

మరో రెండు నిముషాల ఆలస్యం చేస్తే అసలు డబ్బులు వున్నాయా లేవా అని అడుగుతాడని గ్రహించి జేబులో వున్న వాలెట్ తీసి అతనికి ఒక నోటును అందించాడు షాడో. అదే సమయంలో అక్కడికి వచ్చి నిలబడింది ఒక రిక్షా.

రెండు అంగల్లో పోయి అందులో కూర్చున్నాడు.

వెంటనే రిక్షాను కదిలించాడు రిక్షావాలా.

"సైఫర్ టాకీసుకు పోని... హంటర్ వాలాకా బేటా సినిమా చూడాలి..." భుజం మీద నుంచి వెనక్కి చూస్తూ అతనితో అన్నాడు షాడో.

ఆ సినిమా వెళ్ళిపోయి చాలా రోజులు అయింది. ఆ మాట అంటే అతను రిక్షా దిగిపోతాడేమో అని అనుమాన పడి, హుషారుగా విజిల్ వేసి వేగంగా తొక్కాడు రిక్షావాలా. అరగంట తరువాత సైఫర్ టాకీస్ ముందు ఆపి డబ్బులకోసం చేతులు జాచాడు.

## 6

పడమటి దిక్కుగా మరలుతున్న సూర్యుడి కిరణాలు పడి వింతగా మెరుస్తోంది రమ్‌జాన్ దర్గాలో వున్న పురాతన కాలపు భవనం.

దానికి వెనుకభాగంలో ఉన్న పెద్ద నీటి గుంట దగ్గిర కూర్చుని కనులు చిట్లించుకొని చూశాడు షాడో.

పది నిముషాలకు ఒకసారి భవనం చుట్టూ రౌండ్లు కొడుతున్నారు దుడ్డు కర్రలను పట్టుకొని వున్న దృఢకాయులు. భవనం దగ్గిరికి చీమ వచ్చినా సరే వదిలి పెట్టకుండా వెంటపడి తరుముతున్నారు.

వాళ్ళ కళ్లు కప్పి భవనంలోకి పోవటం చాలా కష్టం.

నీటి గుంట వెనుక వున్న పొదల్లోకి పోయి తాజ్ మహల్ బీడీ నొకదాన్ని వెలిగించుకున్నాడు షాడో. అలవాటు ప్రకారం అగ్గిపుల్లను రెండుగా విరిచి, కాలి క్రింద పడేసి నలిపాడు.

అలా చేస్తున్న సమయంలోనే అతని దృష్టిని ఆకర్షించింది తళుక్కుమన్న చిన్న మెరుపు.

అప్రయత్నంగా వెనక్కు దొర్లి శరవేగంతో యింకో పొద చాటుకు దొర్లాడతను. వూపిరి బిగపట్టి మెరుపు కనిపించిన దిశకు చూశాడు.

ఒకటి... రెండు... ఐదు... పది... నిముషాలు గడిచి పోయాయి. మళ్ళీ ఆ మెరుపు కనిపించలేదు. అసలు మనుష్యులెవ్వరూ అది కనిపించిన ప్రదేశంలో నుంచి యివతలకు రాలేదు.

ధైర్యం చేసి ముందుకు జరిగాడు షాడో. అంతకుముందు కూర్చున్న ప్రదేశంలోకి వచ్చి కనులు చిట్లించి చూశాడు. చూస్తుండగానే తళుక్కుమన్నది అది...

నీటి వడ్డున పడి వున్న ఒక తెల్లటి కాయిన్!

సూర్యకిరణాలు దాని మీద పడి షార్ప్‌గా రెఫ్లెక్ట్ అవుతున్నాయి. వాటిని చూసి రివాల్వర్ బారెల్ మీది నుంచి వస్తున్నాయని భ్రమపడినందుకు తనలో తను నవ్వుకుంటూ ముందుకుపోయి ఆ కాయిన్‌ని చేతిలోకి తీసుకున్నాడు.

అప్పుడే అతనికి తగిలింది రెండో షాక్.

పాకిస్థాన్ కాయిన్ కాదది. భారతదేశంలో ఉపయోగింపబడే పావలా కాసు!!

చోటు కాని చోటుకు అది ఎలా వచ్చిందో వూహించటానికి ప్రయత్నిస్తూ, చుట్టూ చూశాడు షాడో. అలా చూస్తుండగా అతనికి కనిపించింది నీటి వడ్డున పడి వున్న పెద్ద బండరాయి. దాని చివరి భాగంలో అగుపిస్తున్నాయి రెండు రక్తపు చుక్కలు.

విపరీతమైన ఆలోచనలు అతని అంతరంగాన్ని ఒకే సారి వేధించటం ప్రారంభించాయి. పావలా కాయిన్ అక్కడికి ఎలా వచ్చింది? బండరాయి మీది రక్తపుచుక్కలు ఎవరివి... అవన్నీ నీటి గుంట దగ్గిరే ఎందుకున్నాయి??

అటూ యిటూ చూసి తలపాగాను వూడతీసి పొదల మధ్య పడేశాడు. కాకీ షర్టును, చిరుగుల బనీనును అన్నిటినీ తీసి నీటి వడ్డున పెట్టాడు. భవనం దగ్గిర కాపలా తిరుగుతున్న వారికి తను కనిపించటం జరగదని నిశ్చయపరుచుకొని నెమ్మదిగా నీటిలోకి జారాడు.

దగ్గిర దగ్గిరగా నాలుగు నిముషాల పాటు నీటిలోనే వుండగల శక్తి అతనికి వుంది. నాలుగు నిముషాలు పూర్తి అయ్యేదాకా అతనికి ఏమీ కనిపించలేదు. పాకుడు పట్టి దుర్వాసన వెలువరిస్తున్నాయి ఆ నీళ్ళు. చేపలు, కప్పలు చచ్చిపోయినట్లు భరించరానిదిగా వుంది ఆ దుర్గంధం.

నాలుగు నిముషాల తరువాత నీటి మీదికి వచ్చి గుండెల నిండా గాలిని పీల్చుకున్నాడు. రెండు క్షణాలు ఆగి మళ్ళీ మునగబోతుండగా అతనికి కనిపించింది --- అతని ప్రశ్నలకు సమాధానం.

నీటిగుంట లోపలి భాగంలో చిన్న గుహమాదిరి తయారయివుంది నేల. ఆ గుహలో పడి వుంది కాళ్ళు చేతులు కట్టివేసి వున్న ఒక శవం.

రెండు బారల్లో దాన్ని సమీపించి జాగ్రత్త గావడ్డు మీదికి చేర్చాడు షాడో. ఎన్ని రోజులనుంచి అక్కడ పడి వున్నదో కాని శిధిలమై పోయే స్థితికి చేరుకుని వున్నదది. ముఖం రబ్బర్ బెలూన్ మాదిరి వుబ్బిపోయింది.

కడుపు నరాలు బిగతీసుకు పోయినట్లు, వామిటింగ్ సెన్సేషన్ కలుగుతున్నట్లు ఫీల్ అయినాడు షాడో ఆ శరీరాన్ని చూసి, అతి ప్రయత్నంమీద తనను తాను కంట్రోల్ చేసుకొని, ఆ శరీరం మీదవున్న దుస్తులన్నిటినీ జాగ్రత్తగా వెతికాడు. పాంటు జేబులో చేయి పెట్టగానే అతనికి తగిలింది ఒక వాలెట్.

తేలికగా నిట్టూర్చి దాన్ని తెరిచాడు.

తెరిచిన మరుక్షణం అతనికి తగిలింది మూడవ షాక్!!

వాలెట్ మధ్యలో నుంచి అతని వంక నవ్వుతూ చూసింది కౌంటర్‌ఫీట్ స్పెషల్ డిటెక్టివ్ సతీష్ చంద్ర ఫోటో.

"... స్పెషల్ బ్రాంచి పంపిన సి.ఐ.డి.లలో సతీష్ చంద్ర అనే డిటెక్టివ్ కబూతర్ సిటీలో వుండగా మాయం అయ్యాడు. అతని జాడల్ని ట్రేస్ చేయటం మన కర్తవ్యం బీ ఆన్ ది లుకౌట్ రాజూ... అతనికి ఏదైనా ప్రమాదం వాటిల్లివుంటే రక్షించటానికి ప్రయత్నించు..."

మాఫీనది వైపు బయలుదేరబోతున్న ఆఖరి క్షణంలో కులకర్ణిగారు అన్న మాటలవి. ఢంకా దెబ్బల్లా యిప్పుడు షాడో చెవుల్లో మార్మోగటం ప్రారంభించాయి.

ఎవరి సహాయము అవసరం లేని లోకాలకు వెళ్ళిపోయాడు సతీష్ చంద్ర. తన విధిని నిర్వర్తించటానికిప్రాణాల్ని పణంగా పెట్టి ఓడిపోయాడు.

చేతిలోని వాలెట్‌ని మూసి తన దుస్తుల మీదికి విసిరేశాడు షాడో. ఒక చెట్టుకొమ్మల పొదలమధ్య చిన్న గోతిని తవ్వి, సతీష్ చంద్ర శరీరాన్ని అందులో పడుకోబెట్టాడు.

అదే సమయంలో గాలి వాలున అతనికి వినవచ్చింది ఏదో కారు అటుగా వస్తున్న శబ్దం.

"జస్ట్ ఎ మినిట్ మై ఫ్రండ్... చేస్తున్న పనిని అర్థాంతరంగా వదిలేసి పోతున్నందుకు ఏమీ అనుకోకు--- ఇప్పుడే వస్తాను" అనుకుంటూ నీటి గుంట దగ్గిర వదిలిన తన దుస్తుల్ని ధరించి భవనం ముందు భాగంలోకి తొంగిచూశాడు.

అప్పుడే కొండగుట్టల చాటునుంచి వచ్చి భవనం ముందు ఆగుతున్నది పెద్ద ప్లయిమత్ కారొకటి. ఇద్దరు ఆజానుబాహులు అందులో నుంచి క్రిందికి దిగి భవనం లోపలికి పోవటం షాడో కనులపడింది.

రౌడీగాంగ్‌లు తిరగాల్సిన ప్రదేశాల్లో ప్లయిమత్ కార్లను మెయింటైన్ చేసే ధనవంతులకు ఏం పని?

దుడ్డు కర్రలు పట్టుకొని వున్న దృఢకాయులతో కాపలా కాయబడుతున్న ఆ భవనంలో తను చూడవలసిన రహస్యం ఏదో చాలా పెద్దదే వుందని గ్రహించి మెల్లిగా వెనుతిరిగి వచ్చాడు షాడో.

మట్టితోను, రాళ్లతోను సతీష్ చంద్ర శరీరాన్ని జాగ్రత్తగా కప్పి మళ్ళీ నీటిగుంట దగ్గిర వున్న పొదల్లోకి పోయి కూర్చున్నాడు.

చీకట్లు ఆ ప్రదేశాన్ని పూర్తిగా చుట్టుముట్టిన తరువాత భవనంలో నుంచి బయటికి వచ్చారు ఆ ఆజానుబాహులు యిద్దరూ. భవనం చుట్టూ తిరిగే దృఢకాయులతో ఏదో చెప్పి ష్లయిమత్‌ని కొండగుట్టల వైపుపోనిచ్చారు.

ఉన్న చోటునుంచి కదలకుండా మరో రెండు గంటల సేపు వెయిట్ చేశాడు షాడో. చీకట్లు ముసురుతున్న కొద్దీ దృఢకాయులు రౌండ్స్ కొట్టటం తగ్గిపోతోంది. అర్ధరాత్రి సమయానికి ఒక ఒక దృఢకాయుడు భవనం వెనుక భాగంలో నిలబడ్డాడు.

వేటను చూసిన పులిలా నిశబ్దంగా అతని వైపు జరిగాడు షాడో. నాలుగు అడుగుల దూరంలోకి పోయేదాకా ఆ దృఢకాయుడికి ఏమీ అర్థంకాలేదు.

ఉన్నట్లుండి లేచి అతని మీదికి జంప్ చేశాడు షాడో. ఎడమ చేత్తో అతని నోటిని మూసి కుడి చేత్తో మెడమీద బలంగా చరిచాడు.

"బాప్ రే బాప్!" అని అరవబోయాడతను. అరుపు అతని పెదవులు దాటి బయటికి రాకముందే స్పృహ తప్పిపోయింది.

అతన్ని పొదల్లోకి దొర్లించి, భవనం వెనుక వున్న ఒక కిటికీని జాగ్రత్తగా పరిశీలించి చూశాడు షాడో.

తుప్పుపట్టి వున్నాయి దాని యినుప చువ్వలు. షాడో చేతులు పడగానే వూడిపోయాయవి. పొదల మధ్యలో వున్న గార్డు వంక ఒకసారి చూసి, మెల్లిగా కిటికీలో నుంచి లోపలికి జారాడు.

చెత్తా చెదారంతో నిండి వున్నాయి భవనం లోపల వున్న గదులన్నీ, కొన్నిటికి తలుపులు వున్నాయి. కొన్నిటికి లేవు.

నాలుగు గదులను దాటి విశాలమైన హాలువంటి గది ముందుకు పోయాడు షాడో. ఆ హాలులో అతనికి కనిపించాయి పెద్ద పెద్ద కాయితాల కట్టలు.

మామూలు కాయితాలు కావు!

పది రూపాయల కాయితాలు!!

## 7

ఒక గోడ చాటున కూర్చుని ఆ కట్టలన్నిటినీ జాగ్రత్తగా పరిశీలించాడు షాడో. దగ్గిర దగ్గిరగా వెయ్యి రూపాయల విలువ చేసే నోట్లు అక్కడ స్టాక్ చేయబడి వున్నాయి.

వాటిని పూర్తిగా మార్కెట్ లోకి విడుదల చేయటం జరిగితే ---

ఆపైన ఆలోచించలేక పోయాడతను. ప్రస్తుతం విడుదల అయివున్న నోట్లవల్లనే తల్లక్రిందులు అయ్యే స్టేజికి చేరుకుంది ఇండియన్ ఎకానమీ... ఇవన్నీ లూజ్ అయితే భారతదేశాన్ని ఆ భగవంతుడే కాపాడాలి!!!

ఎదురుగా వున్న కట్టల్ని చూస్తున్న కొద్దీ షాడో మనసులో రూపం దిద్దుకోవటం ప్రారంభించింది ఒక ప్లాను. రెండు నిముషాల పాటు ఆలోచించి వచ్చిన దారినే కిటికీలో నుంచి భవనం వెనక్కి చేరుకున్నాడు.

పొదల మధ్య పడి వున్న దృఢకాయుడు అప్పుడే చిన్నగా కదులుతున్నాడు. అతని ప్రక్కనే కనిపించిన రాతిని ఎత్తి తలమీద యింకో దెబ్బ వేశాడు షాడో.

బాధగా మూలిగి తల వాల్చేశాడతను.

వెంటనే నీటిగుంట దగ్గిరికి పోయి, అక్కడ వున్న పొదల మధ్యగా కొండ గుట్టల్ని దాటాడు షాడో. అంతకు ముందుకు సారా ట్యూబుల్ని తీసుకొన్న ప్రదేశాన్ని సమీపించే సరికి రాత్రి రెండు గంటల్ని సూచించింది వాలెట్ లో వున్న అతని రిస్ట్ వాచి.

పొదల మధ్య కూర్చుని కునికిపాట్లు పడుతున్నారు సారా బట్టీ మనుష్యులు. వారికి కనిపిస్తే లేనిపోని గోల అవుతుందని షాడోకి తెలుసు. అందువల్ల నిశ్శబ్దంగా అక్కడి పొదల్ని వెతికాడు. ఒక పొదలో అతనికి దొరికాయి నాలుగు ట్యూబులు.

వాటిని తన తలపాగాతో కదలకుండా కట్టి, భుజాల మీద వేసుకొని మళ్ళీ భవనం వైపుబయలుదేరాడు.

పది అడుగులు కూడా వేయక ముందే ఆయాసం అతన్ని వుక్కిరి బిక్కిరి చేయటం మొదలుపెట్టింది. భరించరాని బరువు అతని భుజాల్ని క్రుంగతీయటం ప్రారంభించింది.

పళ్ళ బిగువున అడుగులు వేశాడు షాడో. తెల్లవారు ఝామ అవుతుండగా భవనాన్ని సమీపించి పొదల మధ్య పడిపోయాడు.

"గెటప్ యూ బ్లడీ ఫూల్... తెల్లవారటానికి ఇంకెంతో వ్యవధిలేదు. గెటప్..." అంటూ అతని వెన్ను చరిచి హెచ్చరించింది అంతరాత్మ.

లేచి కూర్చోవటానికి ప్రయత్నించాడు షాడో. కాళ్ళు చేతులు చచ్చుబడి పోయినట్లు కదలలేదు. విపరీతమైన ఆయాసంతో వూపిరి పీల్చుకోవటమే కష్టంగావుంది.

తూర్పు దిక్కున వేగుచుక్క ప్రత్యక్షం అయింది. పొదల్లో చేరి నిద్రలు పోతున్న పిచ్చుకలు కిచ కిచలాడుతూ కనులు తెరవటం మొదలుపెట్టాయి.

తెల్లవారిన మరుక్షణం డ్యూటీలు మారుతాయి. భవనాన్ని కాపలా కాస్తున్న దృఢకాయులు. భవనం వెనుక పొదల్లో పడివున్న దృఢకాయుడి సంగతి ఆ సమయంలో బయటపడి తీరుతుంది.

ఆ మాట అనుకోగానే ఝల్లుమంది షాడో శరీరం. ఇంతసేపు పడిన కష్టం అంతా క్షణంలో మట్టి కొట్టుకుపోవటమా? నెవ్వర్...

పళ్ళు బిగపట్టి, శరీరంలో వున్న శక్తినంతా కూడగట్టుకొని సారా ట్యూబుల్ని నెత్తి మీదికిఎత్తుకోవటానికి ప్రయత్నించాడు. ఒక్క అంగుళం కూడా పైకి లేవలేదు అవి.

తెల్లబడుతున్న తూర్పుదిక్కును గమనించేసరికి చీమలు జెర్రులు పాకినట్లు జలదరించింది అతని శరీరం. అదే సమయంలో అతని మనస్సులో మెదిలింది ఒక ఆలోచన. వెంటనే మూటను విప్పి ఒక ట్యూబ్‌కి కట్టి వున్న తాడును లూజ్ చేశాడు.

గుప్పుమంటూ పైకివచ్చింది నాటు సారా వాసన. వారం రోజుల క్రితం అశోకా హోటల్‌లో బిందుతో కలిసి తీసుకొన్న డిన్నర్ కూడా బయటికి వచ్చేటంత అసహ్యం అతన్ని ఆవరించుకుంది.

అయినా తప్పేదేముంది? అలసిపోయిన అవయవాలకు నూతన శక్తి రావాలంటే ఆ విషాన్ని పుచ్చుకోక తప్పదు!

ట్యూబును ప్రక్కకు వంచి గటగటా రెండు గుటకలు వేశాడు. గొంతును మండిస్తూ లోపలికి పోయింది సారా.... శరీరం తేలిక అయినట్లు గాలిలోకి

తేలబోతున్నట్లు అనిపించటం ప్రారంభించింది. పళ్ళు బిగువున మరో పది గుటకలు వేసి ట్యూబును తిరిగి బిగించేశాడు.

కార్చిచ్చు మాదిరి అతని శరీరాన్ని ఆవరించుకుంది మత్తు. కనుల ముందున్న ప్రపంచం అంతా రెండుసార్లు గిర్రున తిరిగి కొంచెం సేపు అలాగే నిలబడింది.

గుండెల నిండా వూపిరి పీల్చుకొని సారా ట్యూబుల్ని పైకి లేపాడు. రబ్బర్ బంతుల మాదిరి లేచాయవి.

తడబడుతున్న అడుగులతో గబగబా భవనం దగ్గిరికి పోయి, వూచలు లేని కిటికీలోంచి వాటిని లోపలికి దొర్లించాడు.

పొదల్లో పడుకొని వున్న గార్డు అంతకు ముందే లేచి కూర్చుని అయోమయంగా చుట్టూ చూస్తున్నాడు. కిటికీ దగ్గిర నిలబడిన షాడోని గమనించగానే "హేయ్! ఎవరు నువ్వు?" అంటూ లేచి నిలబడ్డాడు.

నాటు సారా మత్తు షాడోని పూర్తిగా ఆవరించుకుంది. ఆ మత్తులో తను ఏం చేస్తున్నాడో తనకే తెలియని పరిస్థితిలో పడి --- అమాంతం వెనక్కి పల్టీ కొట్టాడు.

అదిరిపోయాడు ఆ దృఢకాయుడు. కెవ్వున అరిచి వెనక్కి పారిపోయే ప్రయత్నం చేశాడు.

అరుపు అతని నోటినుంచి వెలువడక ముందే అతని ముందు నేలను తాకి, ఫెడీ మని గుండెలమీద తన్నాడు షాడో.

పది టన్నుల బండరాయి ఏదో గుండెలమీద పడినట్లు బాధగా మూలిగి మొదలు నరికిన చెట్టులా విరుచుకు పడిపోయాడు దృఢకాయుడు.

వెంటనే వెనుతిరిగి, కిటికీలో నుంచి భవనంలోకి జారాడు షాడో. సారా ట్యూబుల్ని నోట్లకట్టలు వున్న హాల్లోకి తీసుకుపోయి చుట్టూ చూశాడు.

హాలుకు అవతలగా వున్న గదిలో పడుకొని గురకలు తీస్తున్నారు నలుగురు దృఢకాయులు. ఎవరయినా వచ్చి లేపితే తప్ప మెలకువ వచ్చేటట్లు కనిపించటం లేదు వారి వాలకం.

సారా ట్యూబుల్ని వూడతీసి నోట్ల కట్టల మీద వెదజల్లాడు షాడో. గుప్పుమని ఆ హాలు నిండా వ్యాపించింది సారా వాసన.

ఆఖరి ట్యూబును కూడా ఖాళీచేసి, పైజమా జేబులో వున్న తాజ్ మహల్ బీడీని వెలిగించుకున్నాడు. అగ్గిపుల్లను ఆర్పకుండా అలాగే నోట్లకట్టల మీదికి విసిరాడు.

భగభగలాడుతూ ప్రాకాయి అగ్నిజ్వాలలు. కళ్ళు మూసి తెరిచేటంతలో నోట్లకట్టలన్నీ అంటుకున్నాయి. నాలుకలు జాస్తూ రెండు నిలువుల ఎత్తుకు లేచి, హాలు పైభాగంలో వున్న కలప సామానును కూడా ఆరగించటం మొదలు పెట్టాయి మంటలు. నల్లటి పొగలు సుడులు తిరుగుతూ నలుమూలలకు వ్యాపించాయి.

ముందు గదిలో పడుకొని వున్న దృఢకాయులు అదిరిపడి లేచారు.

అప్పటికే భవనంకూడా పూర్తి మంటల బారిన పడింది.

ఖణేల్ ఖణేల్ మని శబ్దం చేస్తూ పగలసాగాయి దాని యిటుకలు.

ఆ తర్వాత ఏం జరిగిందో చూడలేదు షాడో. బ్రహ్మ దేవుడు స్వయంగా దిగి వచ్చినా నోట్ల కట్టల్ని కాపాడటం అసంభవం అని గ్రహించిన మరుక్షణం వచ్చిన దారినే బయటికి పోయి కొండగుట్టల వైపు పరుగుతీశాడు.

# 8

"కౌంటర్‌ఫీట్ కరెన్సీ సంబంధంగా సి.ఐ.బి ఏజెంట్ షాడో పాకిస్థాన్ వచ్చాడు. అతను మిమ్మల్ని కంటాక్ట్ చేయటం అంటూ జరిగితే --- పూర్తి సహకారాన్ని అందచేయండి. ఎందుకు ఏమిటి అనే ప్రశ్న లు వేయద్దు."

సూటిగా స్ట్రెయిట్‌గా, అర్థం మారటానికి ఎటువంటి అవకాశమూ లేకుండా కోడ్ లాంగ్వేజిలో వుంది ఆ మెస్సేజి.

ఒకటికి రెండుసార్లు దాన్ని చదివి ఎలక్ట్రిక్ బర్న ర్‌లో పడేస్తూ గాఢంగా నిట్టూర్చా డు ఇండియన్ హై కమీషనర్.

గత రెండు రోజులనుంచీ హై కమీషనర్ కార్యాలయం మీద ఒక కన్ను వేసి వుంచారు పాకిస్థాన్ ఏజెంట్లు. షాడో వస్తాడని వారికి ముందే తెలిసింది కాబోలు!!

టేబిల్ మీదవున్న సిగిరెట్ పాకెట్‌ని అందుకుంటూ కాలింగ్ బజర్‌ని మ్రోగించాడాయన.

వెంటనే ఆ గదిలోకి వచ్చింది ఆయన సెక్రటరీ.

"ఇవ్వాళ గాని రేపు గాని మన దగ్గిరికి ఒక జంటిల్మ న్ వస్తాడు... అతన్ని డై రక్ట్‌గా నా గదిలోకి పంపించు..." సిగరెట్ వెలిగించుకుంటూ ఆర్డర్ యిచ్చాడు హై కమీషనర్.

వచ్చే జంటిల్మ న్ ఎవరో ఆమెకు తెలుసు. కోడెడ్ మెస్సేజిని చూసిన దగ్గిర్నుంచీ ఆమె మనస్సు ఆ జంటిల్మ న్ గురించే ఆలోచిస్తోంది.

ఎలా వుంటాడు షాడో? పోలీసుల మాదిరి మొరటుగా కరుకుగా కనిపిస్తాడా??

ఎన్నెన్నో రకాల వూహలు చేస్తూ తన గదిలోకి పోయి టైప్ రైటర్ ముందు కూర్చున్నదామె. అరగంట తరువాత ఆమె ముందు ప్రత్యక్షం అయ్యాడు హై కమీషనర్ కార్యాలయాన్ని కావలి కాచే రామ్‌సింగ్.

"ఒకసారి మీరు బయటికి రండి మేడమ్... ఎవరో అడుక్కుతినే మనిషి నాలుగు కోతుల్ని వెంట పెట్టుకొని వచ్చి మన బిల్డింగ్ ముందు బిచాణా వేసాడు. ఎంత చెప్పినా అవతలికి పోవటం లేదు..." విసుగ్గా చూస్తూ రిపోర్ట్ చేశాడతను.

కుర్చీలోనుంచి లేచి అతనితోపాటు బయటికి పోయింది సెక్రటరీ.

ముఖద్వారం దగ్గరే ఆమెకు కనిపించాడు ఆ బెగ్గర్... అతని భుజాల మీద కూర్చుని ఆనందంగా అతని తలని పేల కోసం వెతుకుతున్నాయి రెండు కోతులు. మరో రెండు అతని వళ్ళో కూర్చుని రోడ్ మీది కార్లను వింతగా చూస్తున్నాయి.

"ఎవరు నువ్వు? ఇక్కడ దారికి అడ్డంగా కూర్చుంటే ఎలా?" కోపంగా అడిగింది సెక్రటరీ.

"మన్నించాలి మేడమ్... మూడు రంగుల పతాకాన్ని చూసి ఇక్కడికి వచ్చాను... మీరు కాదు కూడదంటే వెళ్ళి పోతాను..." స్వచ్ఛమైన హిందీలో ఆమెకు మాత్రమే వినిపించేటట్లు అన్నాడు ఆ బెగ్గర్.

ఆ మాటల వెనుక వున్న అర్థాన్ని గ్రహించే సరికి కరెంట్ షాక్ కొట్టినట్లు వులిక్కిపడింది సెక్రటరీ. ఏదో అనటానికి ప్రయత్నించబోతుండగా చిరునవ్వుతో చేయి ఎత్తి మధ్యలోనే అడ్డుకున్నాడతను.

"ఎంతోమంది స్నేహితులు నాకోసం ఎదురు చూస్తున్నారు మేడమ్... మీరు అలా ఆశ్చర్యంగా చూడటం మొదలు పెడితే, వాళ్ళు గుర్తు పట్టేస్తారు. ఆ తర్వాత నెత్తి నోరు కొట్టుకున్నా ఏమీ ప్రయోజనం ఉండదు."

తన ఆశ్చర్యాన్ని తన లోనే దాచేసుకుంది సెక్రటరీ.

"రామ్‌సింగ్... ఇతన్ని లోపలికి తీసుకురా..." అంటూ వాచ్‌మన్‌కు ఆర్డర్ యివ్వబోయింది.

ఆ మాటలకు కూడా చిరునవ్వుతో తల అడ్డం తిప్పాడు ఆ బెగ్గర్.

"నేను లోపలికి వస్తే కథ అంతా అడ్డం తిరుగుతుంది మేడమ్... ముందు నాకు తినటానికి ఏదైనా పంపించండి.. ఎట్టి పరిస్థితిలోను నేను బెగ్గర్‌నని మర్చిపోకండి..." అన్నాడు కనుచివరల నుంచి చుట్టూ చూస్తూ.

హై కమీషన్ కార్యాలయం ఎదుట రెండు హోటళ్ళు వున్నాయి. వాటిముందు నిలబడి అతన్ని, సెక్రటరీని జాగ్రత్త గాగమనిస్తున్నారు నలుగురు వ్యక్తులు.

మారు మాటాడకుండా కార్యాలయం లోపలికి వెళ్ళింది సెక్రటరీ. ఎదురు చూస్తున్న షాడో నోటీస్ కూడా ఇవ్వకుండా వచ్చి, గుమ్మంలోనే కూర్చునేసరికి ఆమెకు వణుకు ప్రారంభం అయింది.

తినటానికి ఏదైనా తీసుకు రమ్మన్నాడతను... ఏది తీసుకుపోవాలి??

ఆమె దృష్టి అప్రయత్నంగా తన కోసం తెచ్చుకున్న టిఫిన్ బాక్స్ మీద పడింది. ఆఫీసుకు బయలుదేరే హడావుడిలో ఇష్టం వచ్చినట్లు తయారు చేసుకున్న వుప్మా వుంది ఆ బాక్సులో... షాడోకి నచ్చుతుందో! నచ్చదో!!

అర్థం పర్థం లేని ఆలోచనలతో సతమతం అయి పోతూ టిఫిన్ బాక్సులోని ఉప్మాను ఒక పేపర్ లో పెట్టుకొని ముఖద్వారం దగ్గరికి పోయిందామె.

అక్కడే కూర్చుని ఉన్నాడు షాడో. ఆమె చేతుల్లోని ఉప్మాను చూసి చిరునవ్వు నవ్వుతూ అందుకున్నాడు. అలా అందుకుంటున్న సమయంలోనే చిన్న చీటి ఒకటి చేతుల్లో నుంచి సెక్రటరీ చేతుల్లోకి వచ్చింది.

దాన్ని ఎవరికీ కనిపించకుండా అరచేతుల్లో దాచుకుంటూ ఊపిరి బిగపట్టి షాడో వంక చూసిందామె.

ఎంత బాధ్యతాయుతమైన ఉద్యోగం చేస్తున్నా ఆమె ఒక స్త్రీ. తను చేసిన వంటకం అవతలి మనిషికి నచ్చుతుందో లేదో అన్న అనుమానం అందరినీ పీడించినట్లే ఆమెను కూడా పీడిస్తోంది.

కాయితం లోని ఉప్మాను నోటిలో వేసుకొని చప్పరించాడు షాడో.

"అద్భుతం మేడమ్... ఇటువంటి ఉప్మా తిని చాలా రోజులు అయింది" అన్నాడు.

థౌజండ్ కాండిల్ బల్బు మాదిరి గుప్పున వెలిగింది సెక్రటరీ ముఖం. తన సంతోషాన్ని తనలోనే దాచుకోవటానికి విఫల ప్రయత్నంచేస్తూ లోపలికి పరుగుతీసిందామె.

తన టేబిల్ దగ్గరికి పోయి షాడో అందించిన చీటీని తెరిచి చూసింది.

"కబూతర్ సిటీలో త్రిపుల్ వై త్రీ ఫోర్ త్రీ అనే నెంబర్ కల ప్లయిమత్ కారును చూశాడు. దాని ఓనర్ ఎవరో తెలుసుకోవటానికి నేను చేసిన ప్రయత్నాలన్నీ వృధా

అయినాయి. పాకిస్థాన్ ఏజెంట్లు నన్ను క్లోజ్‌గా ఫాలో అవుతున్నారు. ఎవరికీ అనుమానం కలుగని విధంగా ఆ కారు వివరాలు తెలుసుకోవాలి..."

చీటీని తీసుకొని హైకమీషనర్ దగ్గరికి పోయిందామె.

"మనం ఎదురు చూస్తున్న జంటిల్మన్ వచ్చాడు సర్" అంటూ ఆయన ముందుపెట్టి తన గదిలోకి తిరిగి వచ్చేసింది.

అరగంట తరువాత యింకొక చీటీని తెచ్చి ఆమెకు అందించాడు హై కమీషనర్. "బీ కేర్ ఫుల్ డియర్... మనం ఏదైనాపొరపాటు చేస్తే ప్రమాదం అతన్ని చుట్టు ముడుతుంది" అని హెచ్చరించాడు.

అప్పటికి మధ్యాహ్న సమయం అయింది కమీషనర్ కార్యాలయం ముందున్న హోటల్లో లంచ్ తీసుకోవటం అప్పుడప్పుడూ సెక్రటరీకి అలవాటు. అదే మాదిరి బయలుదేరిందామె.

ముఖద్వారం ప్రక్కనే కూర్చుని కునికిపాట్లు పడుతున్నాడు షాడో. అతని కోతులు నాలుగూ సెక్రటరీని చూడగానే పళ్ళు బయటపెట్టి కిచ కిచ లాడాయి.

వాటిని గమనించనట్లే ముందుకుపోయి రోడ్డును క్రాస్ చేసిందామె. షాడో ప్రక్కనుంచి పోయేటప్పుడు హై కమీషనర్ ఇచ్చిన చీటీని అతని వళ్ళో పడేటట్లు జార విడిచింది.

కామ్‌గా దాన్ని అందుకొని తన పైజమా జేబులో పెట్టుకున్నాడు షాడో. ఒక అరగంట సేపు అక్కడే గడిపి, ఆ తరువాత మెల్లిగా అవతలికి వెళ్ళిపోయాడు.

## 9

దుమ్ము తెరలు రేపుతూ వేగంగా వచ్చి రహమాన్ మంజిల్ ముందు ఆగింది బ్లూ కలర్ ప్లయిమత్ కారు. ముందు సీట్లో కూర్చుని ఉన్న ఆజానుబాహులిద్దరూ విండోలో నుంచి తలలు బయటికి పెట్టి చేతులు వూపారు.

రెండు క్షణాల తరువాత రహమాన్ మంజిల్ ముందున్న యినుప గేట్లు కిర కిర మని శబ్దాలు చేస్తూ తెరుచుకున్నాయి.

మెల్లిగా కదిలి లోపలికి పోయింది ప్లయిమత్. వెంటనే మూసుకున్నాయి గేట్లు.

రహమాన్ మంజిల్ ముందున్న చెట్టు క్రింద కూర్చుని తన కోతుల్ని ముద్దు చేస్తున్న షాడో ఆ కారును, దాని నెంబర్‌నీ, అందులోని వ్యక్తుల్ని చూసి మెల్లిగా లేచి నిలబడ్డాడు.

"ఏయ్ ఎవరు నువ్వు?" వెంటనే ప్రశ్నించాడు అప్పుడే గేటు ముందుకు వస్తున్న గార్డు ఒకతను.

"ధర్మప్రభువులు చల్లగా ఉండాలి... అల్లా పేరు మీద ఏదైనా యిస్తే పుచ్చుకుంటాను" అంటూ గేటు దగ్గిరికి పోయాడు షాడో.

"యివ్వటం గివ్వటం జాన్తానై... మర్యాదగా యిక్కడి నుంచి వెళ్ళిపో..." చేతిలోని దుడ్డు కర్రను పైకి ఎత్తుతూ కర్కశంగా అన్నాడు గార్డు.

ముఖాన్ని నయాపైసా అంత చేసుకొని తనలో తను గొణుక్కుంటూ వెనుతిరిగి గ్రామంలోకి బయలుదేరాడు షాడో.

కబూతర్ సిటీకి అరవై అయిదు మైళ్ళ దూరంలో వుంది బిజినో గ్రామం. ఆ గ్రామానికి అయిదు మైళ్ళ దూరంలో ఉంటుంది రహమాన్ ఎస్టేట్. ఎనభై సంవత్సరాల వృద్ధుడు రహమాన్. తన ముద్దుల భార్య నసీమాకు కానుకగా కొనిచ్చాడు బ్లూకలర్ ప్లయిమత్‌ని.

హై కమీషనర్ సేకరించి ఇచ్చిన ఆ వివరాలను మననం చేసుకుంటూ అన్యమనస్కంగా బిజినో గ్రామంలోకి వచ్చాడు షాడో.

అదే సమయంలో అతనికి కొద్ది దూరంలోనే చెలరేగింది పెద్ద అలజడి. వీధిలో నిలబడి వున్న గ్రామస్థులు అందరూ పులిని చూసినట్లు ఖంగారుగా అరుస్తూ తలా ఒక దిక్కుకు పరుగులు తీస్తున్నారు.

వారి అరుపుల్ని మించిన శబ్దంతో వేగంగా దూసుకు వస్తోంది జోడు గుర్రాల బగ్గీ ఒకటి. దాన్ని నడుపుతున్న డ్రయివర్ గ్రామస్థుల భయాన్ని చూసి వికటంగా నవ్వుతూ చేతిలోని కొరడాను గిరగిరా తిప్పి గుర్రాల తలలమీద ఛణేల్ మనిపించాడు.

బాధతో పెద్ద సకిలించి మరింత వేగంగా బగ్గీని లాగటం ప్రారంభించాయి ఆ గుర్రాలు.

అందరితో పాటు తను కూడా వీధి ప్రక్కకు పోయి నిలబడ్డాడు షాడో.

గుర్రపు బగ్గీ అతనికి పది అడుగుల దూరంలోకి వస్తుండగా ఎవరూ ఎదురుచూడని సంఘటన ఒకటి సంభవించింది.

అంతవరకూ ఒక సందులో ఆడుకొంటున్న పిల్లలు కొందరు గుర్రాల సకిలింతలు విని వీధిలోకి పరిగెత్తుకొచ్చారు.

"అయ్యయ్యో! వెనక్కి పొండి... వెనక్కి పొండి." ఆందోళనగా అరిచారు కొందరు గ్రామస్థులు.

అదిరిపడి వెనక్కు తగ్గారు పిల్లలు. ఏడు సంవత్సరాల బాలిక మాత్రం అలాగే రోడ్డుమీద నిలబడిపోయింది.

తమ వేగాన్ని ఎంత మాత్రమూ తగ్గించుకోకుండా సూటిగా వచ్చేశాయి గుర్రాలు. ఆ బాలిక పని అయిపోయిందనే భావించారు గ్రామస్థులు.

ఆపైన చూస్తూ నిలబడలేక పోయాడు షాడో. భుజం మీద వున్న కోతుల్ని క్రింద పడేసి బాణంలా రోడ్డుకు అడ్డంపడ్డాడు.

దడదడలాడుతూ అతన్ని సమీపించింది గుర్రబ్బగ్గీ. దాని డ్రయివర్ మరింత వికృతంగా నవ్వుతూ కొరడాను ఝుళిపించాడు.

ఊపిరి బిగపట్టి గాలిలోకి పల్టీకొట్టాడు షాడో. సూటిగా పోయి, శిలా విగ్రహంలా నిలబడివున్న బాలిక దగ్గర నేలను తాకాడు.

బగ్గీకి కుడివైపునఉన్న గుర్రం బిగ్గరిగా సకిలించి తన తలను విదిలించింది.

షాడో భుజానికి తగిలింది దాని తల. లాగిపెట్టి ఎవరో భుజంమీద గుద్దినట్లు తూలి రోడ్డు ప్రక్కన పడ్డాడు. పడుతూ పడుతూ తన ముందున్న పిల్లను ఎత్తి అవతలికి విసిరేశాడు.

అతని తలకు ఆరు అంగుళాల దూరంలో నుంచి అవతలకు దూసుకుపోయాయి బగ్గీ చక్రాలు. వాటి వేగానికి సుడులు తిరుగుతూ లేచిన దుమ్ము అతని ముఖం నిండా పడింది.

నోళ్ళు తెరుచుకుని చూస్తున్న గ్రామస్థులందరూ పరుగుపరుగున వచ్చి అతనికి చేతులు అందించారు. రెండు మట్టి ముంతల నిండా నీళ్ళు తెచ్చి అతని తల మీద పోశారు వారిలో కొందరు.

చిటికెలో మృత్యు ముఖంలో నుంచి తప్పించుకున్న బాలికను ఎత్తుకొని షాడో ముందుకు వచ్చాడు ఒక వృద్ధుడు.

"రహమాన్ భార్య నసీమా బగ్గీకి అడ్డం నిలబడి ప్రాణాలతో బయటపడగలిగిన వాళ్ళు యింతవరకూ ఎవరూలేరు భాయీసాబ్... నా కూతుర్ని రక్షించి నా వంశాన్ని నిలబెట్టావ్... నీ ఋణాన్ని ఎలా తీర్చుకోగలను?" గద్గదికంగా అంటూ సలాం చేశాడు.

చిన్నగా నవ్వి, బెదురు చూపులు చూస్తున్న బాలిక బుగ్గలమీద చిటికె వేసి, మెల్లగా ముందుకు కదిలాడు షాడో. అక్కడే నిలబడితే అనవసరమైన ప్రశ్నలు వేయటం ప్రారంభిస్తారు ఆ గ్రామస్థులు. వాటికి సమాధానాలు చెప్పటం చాలా కష్టం.

"ఏ వూరు నీది భాయీ సాబ్? ఏం చేస్తూ వుంటావ్?" అంటూ అడగనే అడిగాడు ఒక గ్రామస్థుడు.

ఆ మాటలు వినబడనట్లు తలవంచుకొని సూటిగా ముందుకుపోయాడు షాడో. వీధికి రెండో ప్రక్క కూర్చుని వున్నాయి అతని కోతులు. అతను బయలుదేరడం చూడగానే పరుగు పరుగున పోయి భుజం ఎక్కాయి.

వాటి కిచకిచల్ని గురించి కూడా పట్టించుకోకుండా గ్రామాన్ని దాటి, రెండు మైళ్ళ దూరంలో వున్న కొండ గుట్టలవైపు అడుగులు వేశాడు షాడో. అతని కనుల ముందు శరవేగంతో పరుగులు తీసిన జోడు గుర్రాల బగ్గీ మెదలుతోంది. గుర్రపు తల

తగిలి తను క్రిందపడి పోయినప్పుడు బగ్గీలోనుంచి తొంగి చూసింది అందమైన ఒక యువతి. సానుభూతి చూపించటానికి బదులు గర్వంగా నవ్విందామె.

ఎంత ప్రయత్నించినా ఆమె నవ్వును మరిచిపోలేక పోయాడు షాడో. ఆమె అహంకారానికి తగిన గుణపాఠం నేర్పాలన్న పట్టుదల అతనిలో ప్రవేశించింది.

కొండ గుట్టల్ని సమీపించి ఒక బండరాయి చాటున కూర్చున్నాడు. భుజానికి తగిలించుకొని వున్న సంచీని తెరిచి రెండు బిస్కెట్ పాకెట్లను బయటకు తీశాడు.

అంతవరకూ అతని ముందు బుద్ధిగా కూర్చునివున్న కోతుల్లో విచిత్రమైన మార్పు వచ్చింది.

ఉలిక్కిపడి తను కూడా అటు చూశాడు షాడో.

"కదలకు భయ్యా.... కదిలావంటే ప్రాణాలు పోగొట్టుకోవాల్సి వస్తుంది..." అంటూ రెండు రైఫిల్స్‌ని పట్టుకొని అతని ముందుకు వచ్చారు యిద్దరు దృఢకాయులు.

వారి వునికిని ముందే కనిపెట్టలేకపోయినందుకు తనను తానే నిందించుకొంటూ చేతులు గాలిలోకి ఎత్తాడు షాడో.

అతని కోతులకు మాత్రం చేతులు గాలిలోకి ఎత్తాలని తెలియలేదు. మునుపటి కంటే వికృతంగా అరుస్తూ ఒకేసారి దృఢకాయుల మీద కలబడ్డాయవి.

అదిరిపడి వెనక్కు దూకారిద్దరూ. అటువంటి అవకాశం కోసమే ఎదురు చూస్తున్నాడు షాడో. క్షణం కూడా ఆలస్యం చేయకుండా గాలిలోకి ఎగిరి ఒక వ్యక్తి చేతి మీద బలంగా తన్నాడు.

బాధగా అరిచి చేతిలోని రైఫిల్‌ని నేలకు వదిలేశాడతను. అదే వూపులో ప్రక్కకు తిరిగి రెండో వ్యక్తి ముఖంమీద బలంగా గుద్దాడు షాడో

తూలుతూపోయి తాము దాగుకొని వున్న రాతిబండకు గుద్దుకున్నాడతను. చేతిలోని రైఫిల్ క్రిందపడి ఖంగుమని శబ్దం చేసింది.

మెరుపులా ముందుకు వంగి దాన్ని అందుకున్నాడు షాడో.

అదే సమయంలో అతని వెనుకనుంచి వినవచ్చింది పెద్ద నవ్వు.

"శహభాష్ రాజు... నీ వేగం ఎంతమాత్రమూ తగ్గలేదు --- ఆ మట్టి బుర్రలకు నువ్వు ఎవ్వరివో తెలియదు. తెలిసి వుంటే గుండె పగిలి చచ్చివుండే వాళ్ళు..." అంటూ వినవచ్చింది ఉరుములాంటి కంఠం.

తన చెవుల్ని తనే నమ్మలేక ఆశ్చర్యంగా వెనుతిరిగి చూశాడు షాడో.

మరుక్షణం గట్టు తెగిన వరదలా వచ్చి అతన్ని చుట్టుముట్టారు పాతికమంది దృఢకాయులు.

"రాజా సాబ్ జిందాబాద్..." అని అరుస్తూ అమాంతం గాలిలోకి ఎత్తి గిరగిరా తిప్పారు.

మదించిన ఏనుగులా అడుగులు వేస్తూ వారి మధ్యలో నుంచి వచ్చి షాడోని గాఢంగా కౌగిలించుకున్నాడు పాకిస్థాన్ బందిపోటు మహమ్మద్.

షాడోని ఎదిరించిన దృఢకాయులకు అప్పుడు అర్థం అయింది అతనెవరో. గజగజ వణుకుతూ ముందుకు వచ్చి తలలు వంచుకొని నిలబడ్డారు.

వారివైపు కోరగా చూస్తూ బొడ్లో వున్న బాగు మీద చెయ్యి వేయబోయిన మహమ్మద్‌ని వారించాడు షాడో.

"పదండిరా మీరందరూ... ఈ రోజు మనందరికీ పండుగ రోజు... ఈ చుట్టుపట్ల సారా దొరుకుతుందేమో చూసి రండి... పొండి..." అంటూ పదిమంది అనుచరుల్ని తలా ఒక మూలకు పంపాడు మహమ్మద్.

## 10

కొరడాను గాలిలో వూపుతూ గుర్రాల్ని హెచ్చరించింది నసీమా. ఒక్కసారిగా ముందుకు దూకాయవి. గాలిలో తేలుతున్నట్లు పరుగులు తీయసాగింది బగ్గీ.

"నసీమా... నా మాటవిను... వెంట ఎవరినైనా తీసుకుపో..." ఆత్రుత, ఆందోళన కలిసిన కంఠంతో బిగ్గరిగా హెచ్చరించాడు రహమాన్.

గాలికి కొట్టుకుపోయాయి అతని మాటలు. నసీమా చెవికి చేరలేదు. రహమాన్ మంజిల్ గేటును దాటగానే నాలుగు కాళ్ళ మీద గాలప్ వేస్తూ దూరంలో కనిపిస్తున్న కొండ గుట్టలవైపుబయలుదేరాయి బగ్గీ గుర్రాలు.

అప్పుడే కొండల్ని దాటి రెండు అంగుళాలు పైకి లేచాడు సూర్యుడు. రాత్రంతా మంచు కురియటంవల్ల తడితడిగా వున్న కొండలన్నీ సూర్యకిరణాలు సోకి వింత వింత అందాలతో ప్రతిఫలిస్తున్నాయి.

ఆ ప్రకృతి అందాల్ని చూసి పరవశించిపోతూ బగ్గీని సూటిగా కొండల వైపుకే పోనిచ్చింది నసీమా.

కొండల్ని సమీపిస్తుండగా వున్నట్లుండి బిగ్గరిగా సకిలించి, ఆగిపోయాయి గుర్రాలు. ఏవేవో ఆలోచనల్లో పడి మునిగి తేలుతున్న నసీమా వులిక్కి పడి ముందుకు చూసింది.

కొండల చుట్టూ వున్న బండరాళ్ళ చాటునుంచి లేచి ఆమె దారికి అడ్డు నిలబడ్డారు ఎర్రటి తలపాగాలు ధరించిన పాతికమంది దృఢకాయులు.

"ఎవరు మీరు?" కోపంతో కనులు ఎర్రచేస్తూ అడిగింది నసీమా.

"మేం ఎవరిమో గుర్తుపట్టలేకపోతే నువ్వు పాకిస్థాన్‌లో పుట్టిన దానివి కాదని అర్థం, బందిపోటు మహమ్మద్ పేరు పాకిస్థాన్ పరగణాలన్నిటికీ తెలుసు" అంటూ ముందుకు వచ్చి నిలబడ్డాడు మహమ్మద్.

అతని పేరును వినగానే నసీమా రక్తం చల్లబడి పోయింది. చేతిలోని కొరడాను అవతలికి విసిరి బగ్గీలోనుంచి క్రిందికి దూకటానికి ప్రయత్నించింది.

గాలిలో వుండగానే ఆమె నడుమును పట్టుకొని క్రిందికి దించుతూ బిగ్గరిగా నవ్వాడు మహమ్మద్.

"వారేవా బుల్ బుల్... ఇంతవరకూ ఏ ఆడది నా మనస్సును కదిలించలేదు. నీ అందం నన్ను పిచ్చివాణ్ణి చేసేస్తోంది..." అంటూ ఆమెను కౌగలించుకొని ముద్దు పెట్టుకోబోయాడు.

కెవ్వున అరిచి అతని ముఖంమీద కొట్టింది నసీమా. అతని చేతుల్లోనుంచి నేల మీదికి జారి తమ ఎస్టేట్ వైపు పరిగెత్తటానికిప్రయత్నించింది.

రెండు అంగల్లో ఆమెను సమీపించి అమాంతంగా ఎత్తి భుజంమీద వేసుకున్నాడు మహమ్మద్.

"రక్షించండి... నన్ను రక్షించండి..." అంటూ గొంతు చించుకొని అరిచింది నసీమా.

"నీ గుర్రపు బగ్గీ క్రిందపడి ప్రాణాలు పోగొట్టుకున్న వారి అరుపుల్ని ఆలకించే నాధుడు యీ పరగణాలో లేకపోయాడు... ఇప్పుడు నీ గోడును మాత్రం యింకొకరు ఎందుకు ఆలకించాలి? ముద్దుకు ముద్దు - గుద్దుకు గుద్దు అల్లా చూపే న్యాయం... నువ్వు నీ పాపాలకు శిక్ష అనుభవించక తప్పదు బుల్ బుల్..." ఆమెను ఒక బండ చాటుకు తీసుకుపోతూ అన్నాడు మహమ్మద్.

భయంతో తెల్లగా పాలిపోయింది నసీమా ముఖం. చేతులు జోడించి తనను వదిలేయమని వేడుకుంది. వదిలేస్తే ఎంత డబ్బు కావాలన్నా ఇస్తానంది.

ఆ మాటల్ని అసలు వినిపించుకోలేదతను. వున్నట్లుండి ఆమె జాకెట్ని పట్టుకొని పర్రున చించేశాడు.

ఆఖరి ప్రయత్నంగా అతని చేతుల్ని విదిలించి కొట్టి కొండల మీదికి పరుగుతీసింది నసీమా. పది అడుగులు కూడా వేయక ముందే వేటకుక్కల్లా ఆమెను అడ్డుకున్నారు మహమ్మద్ అనుచరులు.

వారి చేతుల్లో చిక్కి తను సర్వనాశనం కావటంకంటే మరో మార్గం లేదని గ్రహించి వెక్కి వెక్కి ఏడుస్తూ నిలుచున్న చోటే కూలబడి పోయిందామె.

సరిగ్గా అదే సమయంలో ఆమె ఏడుపు విని అక్కడికి వచ్చాడు ఒక యువకుడు. అక్కడి పరిస్థితిని అర్థం చేసుకున్న మరుక్షణం, పిడికిళ్ళు బిగించి ఆ బందిపోట్ల మీద కలబడ్డాడు.

"రేయ్... చంపండిరా వాడిని... నరకండి..." ఎనుబోతులా రంకెవేసి ముందుకు దూకాడు మహమ్మద్.

అతన్ని దగ్గిరికి రానిచ్చి టపటప రెండు గుద్దులు గుద్దాడు ఆ యువకుడు. బాధతో మరింత భీకరంగా అరుస్తూ నేలవాలిపోయాడు మహమ్మద్.

తమ నాయకుడు పడిపోవటాన్ని చూసి పొలికేకకు పెడుతూ ఆ యువకుడిని కమ్ముకున్నారు బందిపోట్లు అందరూ.

గుండెలమీద చేతులు వేసుకుని చూస్తోంది నసీమా. ఎందరో ధైర్యశాలులను చూసిందామె. వట్టి చేతులతో అంతమందిని ఎదిరించగల మొండి మనిషిని చూడటం మాత్రం యిదే ప్రథమం.

ఆమె కళ్ళ ముందే అరగంట సేపు జరిగిందా పోరాటం. ఆ యువకుడి శరీరమంతా రక్తసిక్తమై పోయింది. అతని కంటే దారుణంగా తయారైనారు బందిపోట్లు. అతని ధాటికి తట్టుకోలేక, క్రింద పడిపోయిన తమ నాయకుణ్ణి తీసుకొని కొండల్లోకి పారిపోయారు.

తూలుతూ నిలబడిన యువకుడి దగ్గిరికి పరిగెత్తి తన పమిట చెంగుతో అతని ముఖాన్ని తుడిచింది నసీమా.

"మీరు అర్జంటుగా వెళ్ళిపొండి మేంసాబ్...ఆ దొంగనాయాళ్ళు మళ్ళీ తిరిగి రావచ్చు" ఆందోళనగా అన్నాడు ఆ యువకుడు.

అందంగా నవ్వి తన బగ్గీ దగ్గిరికి పరుగుతీసింది నసీమా.

"నీ పేరేమిటి" బగ్గీ ఎక్కి గుర్రాల్ని వెనక్కి తిప్పుతూ అడిగింది.

"సలీం..." ముక్తసరిగాసమాధానమిచ్చాడతను.

"చూడు సలీం... రాత్రి పన్నెండు గంటలకు రహమాన్ మంజిల్ వెనుకవున్న వూలతోట దగ్గిరికిరా... నీ కోసం ఎదురు చూస్తుంటాను." అంటూ చటుక్కున ముందుకు వంగి అతని పెదవుల్ని ముద్దు పెట్టుకుంది.

ఆశ్చర్యంతో మ్రాన్పడి పోయాడు ఆ యువకుడు.

"వస్తాను సలీం... ఈ నసీమాను సంతోషపెడితే నీ జీవితం బంగారు బాట అవుతుంది... రాత్రికి రా." అంటూ గుర్రాల్ని అదిలించి బగ్గీని ముందుకు పోనిచ్చింది.

బగ్గీ కనుమరుగు అయిపోయేదాకా అక్కడే నిలబడ్డాడు ఆ యువకుడు. ఆ తరువాత వెనుదిరిగి కొండల్లోకి వచ్చాడు.

"అదృష్టం అంటే అలా వుండాలి రాజూ భాయ్... నన్ను చూసి ముఖం పగలగొట్టింది, నిన్ను చూసి ముద్దు పెట్టుకుంది. మీ ఇండియాలో ఏవైనా వశీకరణ మంత్రాలుంటే చెప్పు... రెండు మూడు మంత్రాలు నేర్చుకోకపోతే లాభం లేదు..." కొండ రాళ్ళ మధ్య కూర్చుని సారా సీసాల్ని ఖాళీచేస్తూ అన్నాడు మహమ్మద్.

అతని బారినుంచి నసీమాను రక్షించినట్లు నటించిన షాడో ఒక సిగరెట్ వెలిగించుకొని అతని ప్రక్కన కూర్చున్నాడు.

"కౌంటర్‌ఫీట్ కరెన్సీని తయారుచేసేవాళ్ళు రహమాన్ మంజిల్లో వున్నారనేనా నీ అనుమానం ?" మృదువుగా అడిగాడు మహమ్మద్.

అవునన్నట్లు తల వూపాడు షాడో.

"అచ్చా రాజూ భాయ్... నీ దారికి అడ్డం రాను నేను. రేపు రాత్రి పూర్తి అయ్యే లోపల నీ పని పూర్తి చేసుకో. సరిగ్గా ఇరవై నాలుగు గంటల తరువాత నేను రహమాన్ మంజిల్‌ని దోచుకోబోతున్నాను..." గంభీరంగా అన్నాడు మహమ్మద్.

ఆశ్చర్యంతో చివ్వున తల ఎత్తాడు షాడో.

ఎక్కడో ఆఫ్ఘనిస్తాన్ సరిహద్దుల దగ్గిర వుండాల్సిన మహమ్మద్ హఠాత్తుగా ఇక్కడ ప్రత్యక్షం కావటం అతనికి మొదటి నుంచీ అనుమానాన్ని కలిగిస్తూనే వుంది. అతని రాక లోని కారణం బోధ పడేసరికి రకరకాల ఆలోచనలు షాడో అంతరంగాన్ని చుట్టుముట్టాయి.

సగం కాలిన సిగరెట్‌ని అవతలికి విసిరేసి, మరో సిగరెట్ వెలిగించుకుంటూ, చేతులు వెనక్కి కట్టుకుని అటూ ఇటూ పచార్లు చేయటం ప్రారంభించాడతను.

## 11

గొంతు మీద ఎవరో కాలు వేసి అదిమినట్లు ఫీల్ అవుతూ కనులు తెరిచి చూశాడు షాడో.

"అప్పుడే నిద్రపట్టిందా? నిద్రపోవటానికా నిన్ను ఇక్కడికి పిలిచింది?" అతని కంఠాన్ని మరింత గట్టిగా కావిలించుకుంటూ అడిగింది నసీమా.

మండుతున్న కళ్ళను తెరిచి వుంచటానికి విపరీతమైన ప్రయత్నం చేస్తూ రిస్ట్ వాచి వైపు చూసుకున్నాడు షాడో.

తెల్లవారు ఝాామున అయిదు గంటల్ని సూచిస్తోంది అది.

"రాత్రి నువ్వు వళ్ళు తెలియకుండా తాగివచ్చావ్? కోపం నటిస్తూ ఆరోపించింది నసీమా.

నుదురు రుద్దుకుంటూ ఆలోచనలో పడ్డాడు షాడో. ఆమె ఆరోపణలో అసత్యం ఏమీలేదు. మహమ్మద్ తెప్పించిన సారా తాగుతూ రాత్రి పదకొండు గంటల దాకా కొండల్లోనే వున్నాడు తను. సారా నిషా విపరీతం అయిపోయింది. మహమ్మద్ తన గుర్రం మీద తీసుకొచ్చి పూల తోట దగ్గర దింపాడు. అప్పటికి పన్నెండు గంటలు అయింది. పూలతోట దగ్గర వెయిట్ చేస్తోంది నసీమా తనను దొంగదారుల వెంట బెడ్ రూంలోకి తీసుకువచ్చింది. నాలుగు గంటల దాకా ఆమె మాట్లాడలేదు! తనను మాట్లాడనీయలేదు...

"ఆలోచనలు ఆనందాన్ని కలుగచేయవు సలీమ్... ప్రక్కనే నేను వుండగా అసలు ఆలోచించాల్సిన అవసరం ఏముంది?" షాడో గుండెల మీదికి ఎగబ్రాకుతూ మత్తుగా అన్నది నసీమా.

ఆమె భుజాల చుట్టూ చేతులు చుట్టి ప్రక్కకు దొర్లించాడు షాడో. అదే సమయంలో బెడ్ రూమ్ తలుపులు దడదడ మని మ్రోతలు చేశాయి.

కోపంతో పళ్ళు కొరుకుతూ బెడ్ దిగింది నసీమా. విసురుగా పోయి తలుపులు తెరిచింది.

అటు వైపు చూసిన షాడోకి ఎనభై సంవత్సరాల వయస్సు కల రహమాన్ గదిలోకి రావటం కనిపించింది.

బెడ్ మీద వున్న షాడోని చూడగానే కోపంతో నల్లగా కమిలిపోయింది రహమాన్ ముఖం.

"దుర్మార్గులారా... నువ్వు చేస్తున్న పని యిదా? ఎన్ని సార్లు చెప్పినా నీ నడవడి మార్చుకోవన్న మాట?" అంటూ విసురుగా చేతిని ఎత్తాడు.

నడుముమీద చేతులు వేసుకొని విలాసంగా నవ్వింది నసీమా.

ఆ నవ్వును చూసే సరికి రహమాన్ చేయి దానంతట అదే క్రిందికి వాలిపోయింది. తనలో తను ఏదో గొణుక్కుంటూ గిరుక్కున వెనుతిరిగి అక్కడినుంచి వెళ్ళిపోయాడు.

తలుపులు మూసి బెడ్ దగ్గరికి తిరిగి వచ్చింది నసీమా.

"రహమాన్ సాబ్‌కి యిప్పుడు కోపం తప్ప యింకేమీ రాదు. నా దారి నేను చూసుకుంటే తప్పు ఏమిటో నాకు అర్థం కాదు... ఇవన్నీ నీకు అనవసరం. నేను చెప్పినట్లు చేయటమే నీ పని..." అంటూ అతని పెదవుల్ని చుంబించింది.

రిస్ట్ వాచి వంక యింకోసారి చూసుకున్నాడు షాడో. ఐదున్నర సూచిస్తోంది అది. సరిగ్గా మరునాడు తెల్లవారు ఝామున ఆరుగంటలకల్లా వచ్చి పడతాడు మహమ్మద్... అతను వచ్చే లోపలే తన పని పూర్తి చేసుకోవాలి...

ఆపైన ముందుకు సాగలేదు షాడో ఆలోచనలు... ఉదయం పది గంటలు అయ్యేదాకా అతన్ని వూపిరి పీల్చుకోనీయలేదు నసీమా.

* * *

"సాబ్... ఓ సాబ్..." అంటూ ఎవరో భుజంమీద చేయి వేయటంతో వులిక్కిపడి కనులు తెరిచాడు షాడో.

బెడ్ ప్రక్కనే నిలబడివున్న ఒక పనిమనిషి ఖంగారుగా రెండు అడుగులు వెనక్కి వేసి జీవం లేని నవ్వొకటి నవ్వింది.

"నసీమా ఎక్కడికి వెళ్ళింది?" తన ప్రక్కన నసీమా లేకపోవటం గమనించి, లేచి కూర్చుంటూ అడిగాడు షాడో.

"మేం సాబ్ గ్రామంలోకి పోయింది. రహమాన్ సాబ్ మిమ్మల్ని ఒకసారి పిలుచుకురమ్మన్నారు...." తడబడుతున్న కంఠంతో చెప్పిందా పనిమనిషి.

బెడ్ క్రింద పడేసిన షర్టును అందుకుని లేచి నిలబడ్డాడు షాడో. పనిమనిషి చూడకుండా షర్టుతో పాటు బెడ్ క్రిందే వున్న చిన్న బాకును కూడా తీసుకొని ఆమె వెంట బయలుదేరాడు.

ఎంతదూరం నడిచినా అంతూ పొంతూ కనిపించని పెద్ద భవనం ఆ రహమాన్ మంజిల్. వంద గదుల దాకా లెక్క పెట్టాడు. ఆ తర్వాత ఓపికలేక ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నాడు.

సందుల్లో గొందుల్లో తిప్పినట్లు రకరకాల గదులలో నుంచి తీసుకుపోయి, విశాలమైన లైబ్రరీరూమ్‌లో ప్రవేశపెట్టింది పనిమనిషి.

పెద్ద పెద్ద పుస్తకాలుబీరువాలు ఆ రూమ్‌లో నిలబెట్టి వున్నాయి. ఎన్నో రకాల పుస్తకాలుఆ బీరువాల్లో అమర్చి వున్నాయి.

"మీరు యిక్కడే వుండండి... రహమాన్ సాబ్ యిప్పుడే వస్తారు..." అంటూ హడావుడిగా అవతలికి వెళ్ళిపోయింది ఆ పనిమనిషి.

పాంటు జేబులో మిగిలిపోయిన ఆఖరి సిగిరెట్‌ని వెలిగించుకుంటూ పుస్తకాల బీరువాలను పరిశీలించాడు షాడో.

అలా చూస్తుండగా ఒక మూల వున్న బీరువా అతని దృష్టిని ఆకర్షించింది. కుతూహలంగా దాని దగ్గిరికి పోయి చేతులతో తడిమి చూశాడు. మధ్యలో వున్న హేండిల్‌ని గట్టిగా నొక్కగానే కిరకిరలాడుతూ ప్రక్కకు జరిగిందా బీరువా. దాని వెనుక రెండు అడుగుల వెడల్పున్న చిన్న సందు ప్రత్యక్షం అయింది.

షాడో కుతూహలం మరింత పెరిగి పెద్దది అయింది. అటూ ఇటూ చూసి ఆ సందులోకి పోయాడు. వెంటనే తనంతట తను యథాస్థానంలోకి చేరుకుంది బీరువా.

"డామిట్.... యిందులోనుంచి బయటపడటం ఎలా?" అనుకుంటూ బీరువా వెనుకభాగాన్ని బలంగా చరిచాడు.

కిర్రుమని శబ్దం చేస్తూ ప్రక్కకు తొలగింది ఆరంగుళాల వెడల్పున్న చెక్క పలక. దానితోపాటు బీరువా అరల్లో వున్న పుస్తకాలుకూడ ప్రక్కకు జరిగాయి కాబోలు. లైబ్రరీరూమ్ షాడో ముందు ప్రత్యక్షం అయింది.

ఆ బీరువాను అక్కడ అమర్చటంలోని పరమార్థం అప్పుడు అతనికి బోధపడింది. రహమాన్ పూర్వీకులు వట్టి అనుమానపు పక్షులు కాబోలు- లైబ్రరీ గదిలో కూర్చుని మాట్లాడుకుంటున్న వారి చర్యల్ని రహస్యంగా గమనించటానికి ఆ బీరువాను అరేంజి చేశారు.

ఆ రహస్య ప్రదేశంలో నుంచి బయటపడే మార్గం షాడోకి కనిపించక ముందే లైబ్రరీలోకి వచ్చాడు రహమాన్. వంటరిగా రాలేదతను. వెంట యిద్దరు ఆజానుబాహులున్నారు.

వారిని చూడగానే బీరువాలో నుంచి బయటికి పోయే ప్రయత్నాన్ని విరమించుకున్నాడు షాడో. ప్లయిమత్ కారులో వచ్చి దొంగ నోట్ల బంగ్లాను పరిశీలించి పోయింది వారిద్దరే. వారిని అనుసరించే తను రహమాన్ ఎస్టేట్‌కి వచ్చాడు. వారి చర్యల్ని గమనించటం కోసమే నసీమాతో పరిచయం చేసుకున్నది.

"ఏడి అతను? ఎక్కడ వున్నాడు?" లైబ్రరీలోకి వస్తూనే అసహనంగా అన్నాడు ఒక ఆజానుబాహుడు.

"పనిమనిషిని పంపాను... వస్తూ వుంటాడు" సమాధానం యిచ్చాడు రహమాన్.

"చూడు రహమాన్... అతను ఎవరో యిక్కడికి ఎందుకు వచ్చాడో మనం వెంటనే తెలుసుకోవాలి. అంత వరకూ నువ్వు కామ్‌గా కూర్చో... నీ పగ సంగతి తర్వాత చూసుకుందాం" అన్నాడు రెండో ఆజానుబాహుడు.

"అదేం కుదరదు... అతను యీ గదిలోకి అడుగు పెట్టిన మరుక్షణం హతమార్చాల్సిందే. నా జనానాలోకి పోయి ద్రోహం చేసినవాడిని ప్రాణాలతో వదిలిపెట్టకూడదు" మరింత కోపంగా అన్నాడు రహమాన్.

వున్నట్లుండి అతని చెంపమీద లాగిపెట్టి కొట్టాడు ఒక ఆజానుబాహుడు. కీచుగా అరిచి ఒక కుర్చీమీద పడ్డాడు రహమాన్. రెండు అంగల్లో అతన్ని సమీపించి చొక్కా పట్టుకొని పైకిలేపాడు రెండో ఆజానుబాహుడు.

"జనానా జనానా అంటూ ఒకసారి మా పథకాల్ని అన్నింటినీ సర్వనాశనం చేశావు. నీ మూలంగానే నిద్రాహారాలు మాని రాత్రింబగళ్ళు శ్రమించి తయారుచేసిన కరెన్సీ అంతా మంటల్లో పడి దగ్ధం అయింది. ఇప్పుడు మళ్ళీ నీ పాత పాట ప్రారంభించావా?" కరుకుగా అడిగాడతను రహమాన్ ముఖంలోకి చూస్తూ.

"నేనేం చేశాను? నా మూలకంగా మీ పథకాలు ఏం పాడయ్యాయి?" ఆశ్చర్యం కోపం కలసిన కంఠంతో అడిగాడు రహమాన్.

"నువ్వుకాక యింకెవరు చేసింది? నీ ముద్దుల భార్య సుల్తాన్ అహమద్‌తో పరిచయం చేసుకోబోతున్నదని తెలిసి అతనికి డబ్బు యిచ్చి ఇండియా తరిమేశావ్. ఆ దుర్మార్గుడు పోతూ పోతూ రెండు సూట్ కేసుల నిండా దొంగనోట్లను నింపుకుని

మరీ పోయాడు. వాడి మూలకంగానే భారత ప్రభుత్వానికి మన రహస్యం తెలిసింది. సుల్తాన్ అహమద్ అందించిన క్లూల ఆధారంగానే వచ్చి మన స్థావరాన్ని తగలపెట్టారు ఇండియన్ ఏజెంట్లు. జరిగిన ఘోరానికి కారకుడివి నువ్వు... నీ భార్యను చెప్పుచేతల్లో పెట్టుకోవటం చేత కాక మా పథకాలన్నీ టికీ అడ్డం వస్తున్నావ్" ఆవేశంగా అన్నాడు మొదటి ఆజానుబాహుడు.

ఆ మాటల్ని వినేసరికి రహమాన్ ముఖం ఎర్రగా కందిపోయింది. చివాలున ప్రక్కకు తిరిగి పాంటు జేబులో వున్న రివాల్వర్‌ని బయటికి తీశాడు.

అతనికంటే వేగంగా కదిలారు ఆజానుబాహులిద్దరూ. చెరొక ప్రక్కనుంచీ అతన్ని చుట్టుముట్టి మెడమీద చెరొక గుద్దు గుద్దారు.

బాధతో గిలగిలలాడుతూ నేలమీద పడిపోయాడు రహమాన్.

అదే సమయంలో లైబ్రరీలోకిఅడుగుపెట్టింది నసీమా.

"సలీం! ఎక్కడున్నావ్ సలీం?" అంటూ లోపలికి వచ్చి ఎదుట కనిపించిన దృశ్యాన్ని చూసి చిత్తరువులానిలబడిపోయిందామె.

"పట్టుకో... ఆమెను కూడా పట్టుకొని బంధిస్తే గాని మన పీడ విరగడ కాదు..." ఖంగుమంటున్న కంఠంతో అన్నాడు ఒక ఆజానుబాహుడు.

ఆ మాటలు వినగానే నసీమా దగ్గిరికి పరిగెత్తాడు అతని సహచరుడు.

తెలివి తెచ్చుకుంది నసీమా. జరగబోతున్న దారుణాన్ని అర్థంచేసుకుంది. వెంటనే వెనుతిరిగి "రక్షించండి... రక్షించండి..." అని అరుస్తూ బయటికి పరుగుతీసింది. ఎంతో దూరం పరిగెత్తకముందే వెంటపడి ఆమె జుట్టును

పట్టుకున్నాడు రెండో ఆజానుబాహుడు. ముళ్ళకంపను ఈడ్చినట్లు క్రింద పడేసి యీడ్చుకుంటూ లైబ్రరీలోకితీసుకువచ్చాడు.

"మనవాళ్ళందర్నీ పిలిచి దీని ప్రియుడు ఏమైనాడో వెతికించు...వాడి విషయంలో నాకు చాలా అనుమానాలున్నాయి..." అంటూ లైబ్రరీ కిటికీలకు వ్రేలాడతీసిన తెరలనుంచి వాటితో నసీమా కాళ్లు చేతులు బంధించాడు మొదటి ఆజానుబాహుడు. స్పృహ లేకుండా పడివున్న రహమాన్‌కి కూడా అదే గతి పట్టింది.

ఈ లోపల లైబ్రరీ ద్వారం దగ్గిరికి పోయి పెద్దగా చప్పట్లు చరిచాడు అతని సహచరుడు. పొడుగాటి దుడ్డు కర్రల్ని పట్టుకున్న దృఢకాయులు అనేక మంది లైబ్రరీముందు గుమిగూడారు.

"పొండి... ఎస్టేట్‌లో కొత్త ముఖాలుకనిపిస్తే పట్టుకురండి..." ఖంగుమంటున్న కంఠంతో ఆర్డర్ యిచ్చాడు అతను.

దుడ్డు కర్రల్ని భుజాలమీద వేసుకొని తలా ఒక దిక్కుకు పరుగులు తీశారు దృఢకాయులందరూ. మరో రెండు నిముషాల తరువాత లైబ్రరీ తలుపులు మూసి తాము కూడా బయటికి వెళ్ళిపోయారు ఆజానుబాహులు ఇద్దరూ.

## 12

బీరువా వెనుక నిలబడి ఆ నాటకాన్నంతా గమనిస్తూనే వున్నాడు షాడో. నోట్ల కట్టల్ని నాశనం చేసినా ఆగకుండా మళ్ళీ నోట్లు ప్రింట్ చేయటానికే ప్రయత్నిస్తున్నారని గ్రహించే సరికి విపరీతమైన ఆవేశం అతన్ని ఆవరించుకుంది.

బీరువాలో నుంచి బయటపడి వారి అంతు చూడాలన్న పిచ్చి కోపంతో, అక్కడి గోడలన్నిటినీ తడిమాడు. అలా తడుముతుండగా అతని చేతికి తగిలింది ఒక

చిన్న బుడిపె వంటి ఇటుకరాయి. వెంటనే దాన్ని పట్టుకొని అటూ ఇటూ తిప్పి చూశాడు. సాలిడ్‌గా గోడకు అతికించి వున్న దది. అంగుళంలో పదిహేనోవంతు కూడ కదలలేదు. రెండు క్షణాలు ఆలోచించి దానిమీద అరచేత్తో బలంగా చరిచాడు.

కిర్రుమని శబ్దంచేస్తూ గోడలోకి వెళ్ళిపోయిందది. దానికి రెండు అడుగులు అవతలగా వున్న గోడ నిశ్శబ్దంగా ప్రక్కకు జరిగి ఒక చిన్న సందు ప్రత్యక్షం అయింది.

పాంటుజేబులో పెట్టుకొని వున్న బాకును బయటికి తీస్తూ ఆ సందులో అడుగుపెట్టాడు షాడో. పాము మెలికలు తిరిగినట్లు వంకరటింకర్లుగా పోయి ఒక చిన్న గదిలో అంతం అయిపోయిందది.

మంచు పర్వతాల మధ్య నిలబడి వున్నట్లు చల్లగా వున్నది ఆ గది. భరింపరాని దుర్వాసన ఆ ప్రదేశాన్నంతా అలుముకొని వుంది.

అడుగులో అడుగువేస్తూ, ఆ గదిని దాటి మరొక గదిలోకి పోయాడు షాడో. కిచకిచలాడుతూ అతని కాళ్ళ మధ్యలోనుంచి అవతలికి పారిపోయాయి రెండు ఎలుకలు.

అవిపోయిన మార్గాన్నే గుడ్డిగా అనుసరించాడతను. అరగంట తరువాత చల్లటిగాలి అతని శరీరానికి తగిలింది.

అక్కడి నుంచీ మరింత జాగ్రత్తగా అడుగులు వేస్తూ ముందుకుపోయాడు. మరో రెండు గదులు దాటిన తర్వాత అతనికి కనిపించింది వెలుగు. వెలుగుతోపాటు దుడ్డు కర్రలను పట్టుకుని వున్న నలుగురు దృఢకాయులు కూడా అగుపించారు.

వారికి కనిపించకుండా అవతలికి పోవటం అసాధ్యం అని గ్రహించి, వెనక్కి జరిగి ఒక గోడ చాటున నిలబడ్డాడు.

తమలో తాము ఏదో విషయాన్ని గురించి తీవ్రంగా చర్చించుకుంటున్నారు ఆ దృఢకాయులు. ఉన్నట్లుండి తమ వెనుక వున్న గదిలో అడుగుల శబ్దం వినవచ్చేసరికి వులిక్కిపడి మాటల్ని ఆపేశారు.

రెండు క్షణాలు ఆగి ఎడమ పాదాన్ని నేలమీద టకటక కొట్టాడు షాడో.

"అదేమిటో చూసి రండిరా..." అన్నాడు ఒక దృఢకాయుడు.

దుడ్డుకర్రల్ని రెడీగా పట్టుకుని షాడో వున్న గదిలోకి వచ్చారు ఇద్దరు దృఢకాయులు. గోడను ఆనుకొని వున్న షాడోని చూడకుండా సూటిగా ముందుకే చూస్తూ మూడు అడుగులు వేశారు.

కంటికి కనిపించనంత వేగంగా కదిలింది షాడో ఎడమపాదం.

"బాప్ రే... మర్ గయా?" అని అరిచి అలాగే నేలమీద పడ్డాడు ఒక దృఢకాయుడు, అదిరిపడివెనుదిరిగాడు రెండో వ్యక్తి.

అతని చేతిలోని దుడ్డుకర్రకు తన బాకును అడ్డంవేసి బలంగా అతని ముఖంమీద గుద్దాడు షాడో.

బిగ్గరిగా అరవటానికి ప్రయత్నించాడా వ్యక్తి. అరుపు అతని నోటిలో నుంచి పూర్తిగా వెలువడక ముందే లాగిపెట్టి గుండెలమీద గుద్దాడు షాడో. పాతిక పౌండ్ల యినుప సుత్తితో గుండెల మీద బాదినట్లు బాధపడుతూ నిలుచున్న వాడు నిలుచున్నట్లే పడిపోయాడతను.

ఆ గల్లంతు బయటవున్న వారికి వినిపించింది. దుడ్డు కర్రల్ని గాలిలో వూపుతూ పరుగు పరుగున లోపలికి వచ్చారు వారిద్దరూ. గోడ చాటుగా మోకరించి కూర్చుని వున్నాడు షాడో. కుడి కాలిని ముందుకు జాచి వారికి అడ్డం పెట్టాడు.

ఆ విషయాన్ని చాలా ఆలస్యంగా గుర్తించారు వారిద్దరూ. బాలెన్స్ నిలబెట్టుకుందామని ప్రయత్నించారు గాని ఫలితం లేకపోయింది. చేతుల్లో వున్న కర్రలు ఎగిరి అవతల పడిపోతుండగా గాలిలో పల్టీలు కొట్టి గోడలకు వేరగిలపడ్డారు.

క్రింద పడిన కర్రల్ని అందుకుని బలంగా వారి తలలు మీద మోదాడు షాడో.

కిక్కురుమనకుండా తలలు వాల్చేసి క్రిందికి జారిపోయారు ఆ దృఢకాయులు ఇద్దరూ. చేతిలోని కర్రల్ని వారి దగ్గిరే పడేసి బయటికి పరుగుతీశాడు షాడో.

రహమాన్ ఎస్టేట్ వెనుక భాగంలో వున్న పూలతోట, ఆ తోటను ఆనుకొని వున్న పెద్ద రేకుల షెడ్డు అతనికి కనిపించాయి.

రేకుల షెడ్డు దగ్గిర మరికొందరు దృఢకాయులు నిలబడి వున్నారు. లోపల ఏవో యంత్రాలు పని చేస్తున్నట్లు వికృతమైన శబ్దం వినవస్తోంది.

పూలతోటలో వున్న పొదలను చాటు చేసుకొని షెడ్డుకి సాధ్యమైనంత దగ్గిరికి పోయాడు.

అప్పుడే ఒక పెద్ద కాయితాల కట్టను తల మీదికి ఎత్తుకొని షెడ్‌లో నుంచి బయటికి వచ్చాడు దృఢకాయుడు.

పూలతోటలో నుంచి వీస్తున్న గాలికి ఒక కాయితం కొంచెం పైకి లేచింది. దాన్ని చూడగానే స్తంభించిపోయింది షాడో వూపిరి.

పదిరూపాయల నోట్లను భారత ప్రభుత్వం ఫ్రీజ్ చేసిందని - యిప్పుడు ఐదు రూపాయల ప్రింటింగ్ ప్రారంభించారు ఈ విద్రోహులు!! వీరిని ఏం చేస్తే బాగుంటుంది?

షాడో ఆలోచనలకు వున్నట్లుండి కలిగింది అంతరాయం. అతను పడగొట్టి వచ్చిన దృఢకాయులలో ఎవరికో తెలివి వచ్చింది కాబోలు గొంతు చినిగి పోయేటట్లు అరుపులు వినరావటం ప్రారంభించాయి.

ఇక అక్కడ వుండడం ఆరోగ్యానికి ఏమంత మంచిది కాదని గ్రహించి నెమ్మదిగా వెనక్కి జరిగాడు షాడో.

చల్లగా అతని మెడకు ఆనుకొంది ఒక రివాల్వర్ బారెల్.

"కదలకు మిస్టర్... కదిలావంటే నీ ప్రాణాలు గాలిలో కలిసిపోతాయి." అంటూ కరుకుగా వినవచ్చింది ఒక గంభీర కంఠం.

ఉలికిపాటును కప్పి పుచ్చుకుంటూ చేతుల్ని గాలిలోకి ఎత్తాడు షాడో. వెంటనే మెడమీద పడింది పిడుగులాంటి దెబ్బ ఒకటి.

కనుల ముందు టెక్నికలర్ నక్షత్రాలు ప్రత్యక్షం అవుతుండగా స్పృహతప్పి ముందుకు వాలిపోయాడు. తిరిగి కనులు తెరిచేసరికి రాత్రి పన్నెండు గంటల్ని సూచిందింది అతని రిస్ట్ వాచి.

"వెల్ మిస్టర్ షాడో... ఎప్పుడు లేస్తావా అని ఎదురు చూస్తున్నాం... మాతో కొంచెం సేపు మాట్లాడటానికి వీలుందా?" వెక్కిరింపుగా అడుగుతూ, ఒక గ్లాసు నిండా నీళ్ళు నింపి అతని ముఖంమీద పోశాడు అంతకుముందు రహమాన్ని, నసీమాను బంధించిన ఆజానుబాహుడు.

# 13

ముఖంమీద పడిన నీళ్ళను విదిలించివేస్తూ ఆశ్చర్యంగా చుట్టూ చూశాడు షాడో.

"వాట్ మిస్టర్ షాడో! ఎందుకలా చూస్తావ్?" అని అడిగాడు రెండో ఆజానుబాహుడు.

"క్షమించాలి... మీరు ఎవరితో మాట్లాడుతున్నారో నాకు అర్థం కావటం లేదు. నా పేరు సలీం. షాడో కాదు..." ఇబ్బందిగా ముఖం పెడుతూ అన్నాడు షాడో.

ఆశ్చర్యంగా ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు అతన్ని బంధించిన వారిద్దరూ. వారి ఆశ్చర్యాన్ని గమనించి పెద్దగా నవ్వుతూ లోపలికి వచ్చాడు పాకిస్థాన్ సీక్రెట్ బ్రాంచి డైరెక్టర్.

అతన్ని చూడగానే తన పాచికలు యిక పారవని షాడోకి అర్థం అయింది.

"పిచ్చి ముఖాల్లారా... షాడోని గురించి మీకు చిలక్కి చెప్పినట్లు చెప్పాను. నోట్లను తగలబెట్టి పోయింది అతనేనని ఆధారాలతో సహా చూపించాను. అతను మీ సమీపంలోకి రాకుండా జాగ్రత్త పడటం పోయి, నేను షాడోని కాదని అతను బుకాయిస్తోంటే నమ్ముతున్నారా? మిమ్మల్ని నమ్మి బాధ్యతాయుతమైన పనులు వప్పగించటం మాది బుద్ధి తక్కువ..." ఆజానుబాహులవైపు చూస్తూ అన్నాడు పాకిస్థాన్ సీక్రెట్ బ్రాంచి డైరెక్టర్.

దొంగ నోట్ల వెనుక సీక్రెట్ బ్రాంచి అదృశ్య హస్తం వుందని తెలిసేసరికి ఆశ్చర్యంతో, ఆందోళనతో పట్టరాని కోపంతో ఎర్రబడిపోయింది షాడో ముఖం.

అతని భావాలను గమనించి మరింత పెద్దగా నవ్వాడు సీక్రెట్ బ్రాంచి డైరెక్టర్.

"యూ డోన్ట్ వర్రీ మైడియర్ షాడో... నువ్వు మాకు చిక్కుతావని అనుకుంటే యిలా దొంగ నోట్లు ప్రింట్ చేయించి వుండేవాళ్ళమే కాదు... మొదలు పెట్టిన పనిని మధ్యలో ఆపటం ఏం బాగుంటుంది చెప్పు?" అంటూ ఒక ఆజానుబాహుడి చెవిలో ఏదో చెప్పాడు.

వెంటనే బయటికి వెళ్ళిపోయాడతను.

అక్కడ నుంచి వెంటనే బయటపడకపోతే ఆ తరువాత బయటపడటం అనే మాటను గురించి ఆలోచించే అవకాశం కూడా లభించదని షాడోకి అర్థం అయింది. సీక్రెట్ బ్రాంచి డైరెక్టర్ తనని కాపిటల్‌కి తరలించే ఏర్పాట్లు చేస్తాడు... అక్కడ చిత్రహింసలు పెట్టి సి.ఐ.బి. సీక్రెట్స్ అడుగుతాడు.

షాడో ఆలోచనలు పూర్తి కాక ముందే ఆ గది బయట పెద్ద కలకలం వినవచ్చింది. "పట్టుకోండి... పట్టుకోండి" అని అరుస్తూ అటూ యిటూ పరిగెత్తటం ప్రారంభించారు కొందరు దృఢకాయులు.

"ఏమిటది? ఏమయింది?" గది బయటికి తొంగి చూస్తూ కోపంగా అడిగాడు యస్.బి.డి.

"కోతులు సార్... కొన్ని కోతులు భవనంలోకి వచ్చి గోలగోల చేస్తున్నాయి..."అని చెప్పి అవతలికి పరుగు తీశారు కొందరు వ్యక్తులు.

కోటు జేబులో వున్న రివాల్వర్ బయటికి తీస్తూ, ఆ గదిలో నుంచి అవతలికి వెళ్ళాడు స్పెషల్ బ్రాంచి డైరెక్టర్.

షాడో ముందు వంటరిగా మిగిలిపోయాడు ఒకే ఒక ఆజానుబాహుడు.

"కోతులు మనుష్యుల్ని పీకితే ఏమౌతుందో తెలుసా?" నవ్వుతూ ప్రశ్నించాడు షాడో.

"షట్ యువర్ బ్లడీ మౌత్" కోపంగా అరిచాడు ఆజానుబాహుడు.

అతని ముఖంమీద ప్రత్యక్షం అవుతున్న చెమట బిందువుల్ని గమనించి చిన్నగా నవ్వాడు షాడో.

"కబూతర్ సిటీలో మీ కరెన్సీని తగలపెట్టి ఇస్లామాబాద్ పోతుండగా రోడ్ మీద నాకు దొరికాయి ఆ కోతులు. ఆకలితో అలమటించి పోతుంటే తీసుకుపోయి తిండి పెట్టాను... అప్పటినుంచీ నాకు వాటికి మంచి ఫ్రండ్‌షిప్ అయింది..." అంటున్నాడు షాడో.

అలా అంటుండగానే గుమ్మంలో ప్రత్యక్షం అయినాయి అతని ఫ్రండ్స్. అతన్ని చూడగానే ఆనందంతో కిచకిచలాడుతూ వచ్చి భుజాల మీదికి ఎక్కాయి.

"పంపించేయ్... వాటిని బయటికి పంపించేయ్..." కీచుగా అరిచాడు ఆ ఆజానుబాహుడు.

అతని అరుపును వినేసరికి పళ్ళు బయటపెట్టి అతని మీదికి దూకింది ఒక కోతి.

అదిరిపడి రివాల్వర్‌ని ఎత్తాడతను.

"వద్దు మిస్టర్... నోరులేని జీవాలవి... నిన్నే మీ చేయవు... ఆగు... ఆగు..." ఆందోళనగా అన్నాడు షాడో.

అతని మాటల్ని వినిపించుకోలేదు ఆజానుబాహుడు. రివాల్వర్‌ని కోతులకేసి గురిపెట్టి ట్రిగ్గర్ నొక్కాడు.

ధనాధన్... ధనాధన్ మని భీకరంగా గర్జించింది అది.

కీచుగా అరిచి క్రిందపడిపోయాయి కోతులు. ఎర్రటి రక్త పు మడుగులో గిలా గిలా కొట్టుకుంటూ ప్రాణాలు వదిలాయి ఆ దృశ్యాన్ని చూసేసరికి షాడో కాలి బొటనవేళ్ళ దగ్గర్నించి బయలుదేరింది ఆవేశం. ఆ గది దద్దరిల్లి పోయేటట్లు అరిచి చేతులకు బంధించి వుంచిన తాళ్ళను తెంచుకున్నా డు.

"ఆగు... అడుగు ముందుకు వేశావంటే చచ్చిపోతావ్..." అంటూ రివాల్వర్ని అతనికేసి గురిపెట్టాడు ఆజానుబాహుడు.

ఆగలేదు షాడో తొడ చరుస్తూ అమాంతం గాలిలోకి లేచి ఎగిరి తన్నా డు అతని ముఖంమీద.

కెవ్వున అరిచాడు ఆజానుబాహుడు. రివాల్వర్ని వదిలి ముఖాన్ని రెండు చేతులతోను కప్పుకుంటూ నేలకూలి పోయాడు.

అతను వదిలిన రివాల్వర్ని అందుకొని బయటికి పరుగు తీశాడు షాడో. ఎదురుగా పది గజాల దూరంలోనే వుంది నోట్లు తయారు చేయబడుతున్న రేకుల షెడ్. దాని ముందున్న దృఢకాయులు అతన్ని చూసి గోల గోలగా అరుస్తూ ఎదురు వచ్చారు. కళ్ళు మూసుకొని ట్రిగ్గర్ నొక్కు తూ వారిలో జొరబడ్డాడు షాడో.

గుండెలు అదిరేటట్లు నాలుగే నాలుగు సార్లు గర్జించింది అది. నలుగురు దృఢకాయులు విగత జీవులై నేలకు దొర్లాయి.

మిగిలిన వారి కర్ర దెబ్బల్ని లక్ష్యపెట్టకుండా షెడ్ లోపలికి దూరాడు షాడో. దడ దడలాడుతూ పనిచేస్తోంది అక్క డ ఒక పెద్ద ప్రింటింగ్ మెషిన్. ఐదు రూపాయల నోట్లు వరసగా ప్రింట్ అయి క్రిందికి పడుతున్నా యి.

ఆ దృశ్యాన్ని చూడగానే షెడ్ గోడలవైపు మరలింది షాడో దృష్టి. ప్రింటింగ్ మెషిన్స్ వున్న చోట రకరకాల యాసిడ్స్ కూడా వుంటాయి... వుండి తీరాలి.

మెషిన్‌కి దగ్గర్లోనే అతనికి కనిపించింది పెద్ద యాసిడ్ కేన్.

క్షణం కూడా ఆలస్యం చేయకుండా పోయి దాన్ని అందుకున్నాడు.

అతని వెనుకే షెడ్ లోకి వచ్చిన దృఢకాయులు గొల్లున అరిచి వెనక్కి దూకారు.

యాసిడ్ కేన్ మూతను వూడదీసి దడదడలాడుతూ పనిచేస్తున్న మెషిన్ మీదికి పంపాడు షాడో.

బుస్సుమంటూ పైకి లేచాయి పొగలు. యాసిడ్ పడిన మరుక్షణం నోట్లను ప్రింట్ చేసే బ్లాకులు కరిగి ఎందుకూ పనికి రాకుండాపోయాయి.

దానిని అలాగే పైకి ఎత్తి షెడ్ ముఖద్వారంవైపు విసిరాడు షాడో. అక్కడ నిలబడి వున్న దృఢకాయుల ముఖాలమీద చిందింది అందులో వున్న యాసిడ్ అంతా.

మంటల్లో నిలబడినట్లు క్షణాలమీద బొబ్బలతో నిండిపోయాయి దృఢకాయుల ముఖాలు. గోల గోలగా అరుస్తూ అక్కడినుంచి పారిపోయారు వారందరూ.

షెడ్‌లో కనపడిన చెత్తాచెదారాన్ని పోగుచేసి అగ్గిపుల్ల గీశాడు షాడో. కిరోసిన్ టిన్నుల్ని, ప్రింటింగ్ యింక్‌ని తీసుకొచ్చి పైకిలేస్తున్న మంటలమీద పడేశాడు.

భగ్గుమంటూ రెండు నిలువుల ఎత్తుకు లేచాయి మంటలు.

"నీళ్ళు... నీళ్లు తీసుకురండి..." ఖంగుమంటూ వినవచ్చింది రెండో ఆజానుబాహుడి కంఠం.

ఆ కంఠాన్ని వినేసరికి షాడోని ఆవరించుకొని వున్న పిచ్చి ఆవేశం కొద్దిగా చల్లబడింది. షెడ్ వెనుకభాగంలో వున్న ఒక కిటికీలోనుంచి బయటికి దూకి పూలతోటలోకి పరుగు తీశాడు.

షెడ్ లోపల అతను సృష్టించిన మంటలు భగ భగలాడుతూ షెడ్ పైభాగాన్ని కూడా ఆవరించుకున్నాయి. చూస్తుండగానే ఎలక్ట్రిక్ తీగెలు అంటుకున్నాయి. కనులు మిరుమిట్లు గొలిపే వెలుగు కానవచ్చింది.

"అయ్యయ్యో... మంటలు భవనంలో మంటలు..." కీచుగా అరిచాడు దృఢకాయులతో కలిసి తిరుగుతున్న రహమాన్ అనుచరుడు ఒకతను.

ఎలక్ట్రిసిటీ షార్ట్ సర్క్యూట్ అవటంవల్ల భవనంలోని వైర్ ఏదో అంటుకొని మంటల్ని రేపినట్లుంది...

పూల చెట్లచాటున నిలబడి రెండో ఆజానుబాహుడి కోసం వెయిట్ చేస్తున్న షాడో ఆవేశం ఆ మంటల్ని చూడగానే మరికొంచెం తగ్గింది.

సడన్‌గా అతని కనుల ముందు మెదిలారు లైబ్రేరీగదిలో బంధింపబడి వున్న రహమాన్ నసీమాలు. వెంటనే ప్రక్కకు తిరిగి అటు వైపుపరుగుతీశాడు.

* * *

"దుర్మార్గుడా... నీ మూలకంగానే మాకీ గతి పట్టింది. నువ్వే యీ వినాశనానికి కారకుడివి... నువ్వు బ్రతికి వుండకూడదు. చావాలి. నువ్వు

చచ్చిపోవాలి..." అంటూ షాడో వూడతీసి క్రిందపడేసిన కర్టెన్ ముక్కల్ని కొరడాలా పట్టుకొని యిష్టం వచ్చినట్లు కొట్టటం మొదలుపెట్టాడు రహమాన్.

బయటి గదుల్లో చెలరేగిన మంటలు లైబ్రరీలోకి కూడా వ్యాపిస్తున్నాయి. దట్టమైన పొగ వూపిరి ఆడనీయటం లేదు.

"రహమాన్ సాబ్... నేను చేసింది తప్పో రైటో తీరికగా విచారించి శిక్ష విధించండి.. .ప్రస్తుతం మనం యిక్కడి నుంచి బయటపడాలి... పదండి..." రహమాన్ వైపుచూస్తూ వేడుకున్నాడు షాడో.

అతని మాటల్ని రహమాన్ వినిపించుకోలేదు. అలాగే యిష్టం వచ్చినట్లు బాదసాగాడు. కొంత సేపు ఓపిక పట్టింది నసీమా. అతని కోపం తగ్గుతుందేమో అని ఆశించిందామె.

అది తగ్గటం మాట అటుంచి క్షణ క్షణానికి ఎక్కువ అవుతున్నది. షాడో పెదవులు తెగి రక్తంగడ్డం మీదికి జారుతున్నది.

అప్పటికీ చేయి ఎత్తి అతన్ని టచ్ చేయలేదు షాడో. అందుకు కారణాలు అతనికే సరిగ్గా అర్థం కాలేదు. అతను ఎనభై సంవత్సరాల వృద్ధుడు అని ఆగి వుండవచ్చు. లేదా నసీమాను తాకి అతనికి ద్రోహం చేశానేమో అన్న బాధకావచ్చు.

ఉన్నట్లుండి ముందుకు దూకి షాడో గొంతు పట్టుకున్నాడు రహమాన్. అంతటితో నసీమా సహనం అంతరించింది.

"తప్పునాది... నన్ను చంపండి... సలీం మీద చేయి వేస్తే మీ ప్రాణాలు తీస్తాను జాగ్రత్త..." అని హుంకరిస్తూ అతని చేయి పట్టుకొని వెనక్కి లాగింది.

ఆ వేగానికి పోయి ఒక కుర్చీమీద పడ్డాడు రహమాన్. అలా పడుతుండగా అతనికి కనిపించింది కుర్చీ క్రింద పడిపోయి వున్న రివాల్వర్. చటుక్కున వంగి దాన్ని అందుకున్నాడతను.

"పారిపో సలీం... పారిపో..." పిచ్చిగా అరిచింది నసీమా.

పారిపోలేదు షాడో. వున్న చోటి నుంచి కదలకుండా అలాగే శిలా విగ్రహంలా నిలబడ్డాడు.

పిచ్చి పట్టినట్లు నవ్వుతూ రివాల్వర్‌ని షాడో వైపు తిప్పాడు రహమాన్. ఉన్నట్లుండి దాన్ని నసీమా వైపుతిప్పి ట్రిగ్గర్ నొక్కాడు.

కెవ్వున అరిచి గుండెల్ని అదుముకుంటూ నేల కూలి పోయింది నసీమా.

"ఇక నీ వంతు బే... నువ్వు కూడా చావు. " అంటూ షాడో వైపు తిరిగాడు రహమాన్.

అప్పటికి లైబ్రేరీలోకివచ్చేశాయి మంటలు. సుడులు తిరుగుతూ లైబ్రరీనంతా ఆవరించుకున్నాయి తెల్లటి పొగలు.

వాటి ఘాటును తట్టుకోలేక పోయాడు రహమాన్. రివాల్వర్ అలాగే వదిలిపెట్టి చాపచుట్టలా నేలమీద పడిపోయాడు.

అప్పటికి చలనం వచ్చింది షాడోలో. చటుక్కున ముందుకు దూకి రహమాన్‌ని, నసీమాను భుజాల మీద వేసుకొని పూల తోటలోకి పరుగుతీశాడు.

ప్రింటింగ్ షెడ్ వుండవలసిన స్థానంలో పెద్ద బొగ్గుల గుట్ట కనిపిస్తోంది. రహమాన్ ఎస్టేట్ అంతా మంటలతో నిండిపోయి వుంది. రెండవ ఆజానుబాహుడు కాని అతని అనుచరులు కాని ఆ చుట్టుపట్ల ఎక్కడా కనిపించటంలేదు.

అన్న మాట ప్రకారం తెల్లవారు ఝామున ఆరు గంటలకు తన అనుచరులందర్నీ వెంటబెట్టుకొని హుటాహుటీన వచ్చి పడ్డాడు బందిపోటు మహమ్మద్.

అగ్ని జ్వాలలతో నిండివున్న భవనాన్ని చూడగానే గుర్రాన్ని దిగి టపటపా నెత్తి మీదకొట్టుకొన్నాడు.

"నాకు తెలుసు... నేను అనుకొంటూనే వున్నాను... ఆ దుర్మార్గుడు అడుగుపెడితే అంతా సర్వనాశనం చేసి గాని అవతలికి పోడు... రేయ్... పొండిరా మంటలు లేని గదుల్లో ఏమైనా మిగిలి వుంటే తీసుకురండి..." అంటూ తన అనుచరులందరికీ ఆజ్ఞలు జారీచేశాడు.

వానర సైన్యం మాదిరి భవనం మీదికి ఎగబడ్డారు అతని అనుచరులు. తూర్పుదిక్కు పూర్తిగా తెల్లబడిన తరువాత రెండు బళ్ళ సామానును లూటీ చేసి వుద్యానవనంలో గుట్ట పోశారు.

అలా పోస్తుండగా వారికి కనిపించాడు షాడో.

ఎత్తుగా పెరిగివున్న అశోక వృక్షాల క్రింద ఆరు గోతుల్ని తవ్వాడతను. వూపిరి ఆడక ప్రాణాలు కోల్పోయిన రహమాన్‌ని ఒక గోతిలో పడుకోబెట్టాడు. రివాల్వర్ దెబ్బకు ప్రాణాలు అర్పించిన నసీమాను యింకో గోయిలో పరుండ చేశాడు.

"రాజా... మిగిలిన గోతులు దేనికి?" మృదువుగా అడిగాడు మహమ్మద్ అతని ప్రక్కకు పోతూ.

మౌనంగా ఒక పూల చెట్టు వైపు చూపించాడు షాడో.

అక్కడ వరుసగా పడుకోబెట్టబడి వున్నాయి అతనితో తిరిగిన కోతులు.

వాటిని చూసేసరికి బండరాయి వంటి మహమ్మద్ గుండె కూడా మంచులా కరిగిపోయింది. అతని కను చివరల నుంచి రెండు నీటి బొట్లు జారి బుగ్గలమీద పడ్డాయి.

## 14

"సో... కౌంటర్ఫీట్ కేసు చాలా కష్టం అయిందంటావ్? అంతేనా? సిగార్ పొగను గుప్పుగుప్పున వదులుతూ గుర్రుగా అడిగారు కులకర్ణి.

"కష్టం అయిందని ప్రత్యేకంగా చెప్పాలా? మీకు కనిపించటంలా వంటి మీది గాయాలు?" షాడో ప్రక్కనే కూర్చుని ఉన్న బిందు వెంటనే అందుకొని మెత్త గాఎత్తి పొడిచింది.

"ఆల్ రైట్.. ఆల్ రైట్.. ఇంతకీ పాకిస్థాన్ సీక్రెట్ ఏజెన్సీ డైరెక్టర్, ఆ రెండో కౌంటర్ ఫీటరూ ఏమయ్యారో చెప్పావు కాదు..." వెంటనే మాట మారుస్తూ అడిగారు కులకర్ణి.

ఏమయ్యారో షాడోకి తెలిస్తే గద ఆయనకి చెప్పగలిగేది? రహమాన్ ఎస్టేట్ నుంచి బయలుదేరి మహమ్మద్తో కలిసి ఆ చుట్టుపట్ల వున్న కొండలు, గుట్టలు, గ్రామాలు, పల్లెలు అన్నిటినీ గాలించాడతను.

పరిస్థితులు అదుపు తప్పినట్లు గ్రహించగానే మాయం అయిపోయాడు సీక్రెట్ ఏజన్సీ డైరెక్టర్.

తన పథకాలన్నీ సర్వనాశనం అయినాయని తెలియగానే పలాయన మంత్రం పఠించాడు రెండో ఆజానుబాహుడు.

మహమ్మద్ సాయంతో బోర్డర్స్‌ని దాటి ఇండియన్ భూభాగంలోకి రాగలిగాడు షాడో. అతని కోసం ఎదురు చూస్తున్న ఆర్మీ జీప్ వెంటనే లిఫ్టు యిచ్చింది.

"వెల్‌డన్ రాజూ... స్పెషల్ బ్రాంచి వాళ్ళయితే సగంలోనే వదిలేసి వచ్చి వుండేవాళ్ళు. వాళ్ల సంగతి నాకు తెలుసు... దమ్ములేని మనుష్యులు..." అంటూ షాడో ఆలోచనలకు అంతరాయాన్ని కలిగించారు కులకర్ణి.

ఆ మాటలు వినగానే జేబులో చేయిపెట్టి ఒక వాలెట్‌ని తీశాడు షాడో.

"వాటీజ్ దట్? ఎవరిది?" ఆశ్చర్యంగా అడుగుతూ దాన్ని అందుకున్నారాయన. ఓపెన్ చేసి చూసేసరికి ఆయన ముఖంమీది నవ్వు మాయమైపోయింది.

"సారీ రాజూ... స్పెషల్ బ్రాంచిని గురించి నేను అన్న మాటలు పూర్తిగా నిజం కాదు. సతీష్ చంద్ర లాంటి కుర్రాళ్ళు ఉండబట్టే దాని పేరు యింతవరకూ నిలబడి వుంది."అన్నారాయన.

క్రింద పడినా ముక్కుకు మట్టి అంటలేదనే కొండపల్లి బొమ్మ మాట గుర్తుకు వచ్చి ఫక్కున నవ్వాడు షాడో.

ఎందుకో అర్థం కాకపోయినా కిలకిలా నవ్వింది బిందు.

వారిని చూసేసరికి తను కూడా నవ్వకుండా ఉండలేక పోయారు కులకర్ణి.

"ఓ.కే సర్... నేను రెండు వారాలు రెస్ట్ తీసుకుంటాను..." అంటూ కుర్చీలోనుంచి లేచి, క్రింద ఉంచిన బ్రీఫ్‌కేసును అందుకున్నాడు షాడో.

"అదేమిటి?" అనుమానంగా అడగనే అడిగారు కులకర్ణి.

"ఇదా... నథింగ్ సార్.... పాకిస్థాన్‌లో దొరికింది..." అంటూ బ్రీఫ్ కేసులు ఓపెన్ చేశాడు షాడో.

ఫెళ ఫెళ లాడుతున్న ఐదు రూపాయల కట్టలు టైట్‌గా పేర్చబడి వున్నాయి అందులో.


"మై గాడ్... యువెక్కడివి! నీకెలా దొరికాయి?" ఆందోళనగా అడుగుతూ కుర్చీలోనుంచి లేచారు కులకర్ణి.

అంతవరకూ చెప్పకుండా ఆపిన ఐదు రూపాయల నోట్ల ప్రింటింగ్‌ని గురించి అప్పుడు చెప్పాడు షాడో.

మండుతున్న భవనంలో నుంచి పదే పది కట్టల్ని యువతలికి లాక్కురాగలిగారు మహమ్మద్ అనుచరులు. వాళ్ళు లాక్కువచ్చిన కట్టలే అవి!

"ఫెంటాస్టిక్ రాజూ... రియల్లీ ఫెంటాస్టిక్..." అంటూ ఆపైన ఏమనాలో తోచక షాడో భుజం మీద బలంగా గుద్దారు కులకర్ణి.

జైహింద్


COUNTER FEET
KILLER
MADHU
BAABU